మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

21.04.2025
సోమవారం Monday
సంపుటి (Volume): 10
సంచిక (Issue) : 03
పేజీలు : 8
Pages : 8
Published from : Karimnagar

## ముంబై హ్యాట్రిక్ విజయం
ఫామ్ చాటుకున్న రోహిత్.. చెన్నై ఖాతాలో ఆరో ఓటమి



07


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## ఆర్టీసీలో కొలువుల జాతర
### 3,038 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

ఎస్సీ వర్గీకరణతో నియామకాలకు మార్గం సుగమం
రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచన
'మహాలక్ష్మి'తో మహిళలకు రూ.5,500 కోట్ల లబ్ధి



03



# హైదరాబాద్‌లో ఎకో టౌన్

హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తం చేశారు. సుస్థిరత ఇకపై ఐచ్చికం కాదని, అవసరమని అన్నారు.

జపాన్‌లోని కిటాక్యుషు మాదిరిగా భాగ్యనగరం
భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం
పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం: రేవంత్
కిటాక్యుషు నగరాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి
జపాన్ సంస్థలతో తెలంగాణ సర్కారు ఒప్పందం
హైదరాబాద్‌లో జపనీస్ పాఠశాల ఏర్పాటు యోచన

**జనతా న్యూస్ హైదరాబాద్ :** ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితోపాటు పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి ఉందన్నారు. జపాన్ పర్యటనలో భాగంగా సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆదివారం పర్యావరణహిత కిటాక్యుష నగరాన్ని సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా

మిగతా 2 లో




## ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య
శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల పడిగాపులు




02

## ఆ రెండు పార్టీలు తెలంగాణకు శత్రువులే..

ప్రజలకు రక్షణ గులాబీ జెండానే
బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కంకణం
వైఎస్ఆర్ తెచ్చిన ఆరోగ్య శ్రీ భేష్..
ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన చంద్రబాబు వారిద్దరినీ అభినందించాల్సిందే: కేటీఆర్



02

## వక్ఫ్ సవరణతో పేద ముస్లింలకు న్యాయం

చట్టానికి వ్యతిరేకంగా బడా చోర్‌ల సభ
ఆ సభకు అంతా సమకూర్చింది రేవంత్
కేంద్ర మంత్రి బండి సంజయ్



02



03

## చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు
### ప్రయోగాత్మక పరీక్ష విజయవంతం

సాధారణ బాంబు తరహాలోనే.. అయినా
తీవ్ర విధ్వంసం సృష్టించే సామర్థ్యం
బాంబు పేలినప్పుడు కొన్ని సెకన్ల పాటు భారీ అగ్నిగోళం
1000 డిగ్రీలకుపైగా వేడితో వినాశనం

అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు.

## కర్ణాటక మాజీ డీజీపీని చంపేసిన భార్య



02

ముఖంపై కారం కొట్టి.. కత్తితో దాడి
ఓంప్రకాశ్‌ని చంపేశానంటూ మరో ఐపీఎస్ భార్యకు ఫోన్ చేసిన వైనం
హత్యలో కుమార్తెకూ భాగస్వామ్యం



02


## తన బిడ్డ ఏమైపోతుందోననే బెంగతో..

4 ఏళ్ల కూతురికి విషమిచ్చి తానూ తాగిన తల్లి
చిన్నారి మృతి..చావు బతుకుల మధ్య మహిళ
అనారోగ్యాన్ని భరించలేక ఆత్మహత్యాయత్నం

## బీజేపీ విధానాలపై కాంగ్రెస్ పోరు

దేశవ్యాప్తంగా అధికార ప్రతినిధుల నియామకం
తెలంగాణకు రణదీప్ సింగ్ సూర్జేవాలా
ఏపీకి ఠాకూర్, సాల్మాన్ సోజ్..
కేరళకు కొప్పుల రాజు

02






## ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య

### శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల పడిగాపులు

**శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 20 :** ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో శంషాబాద్ విమానాశ్రయంలో రెండున్నర గంటలు ప్రయాణికులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం 7.05 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 225 మంది ప్రయాణికులతో గోవా వెళ్లాల్సిన విమానం ఆలస్యమైంది. గోవా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చి తిరిగి అదే విమానం గోవా వెళ్లాల్సి ఉంది. కానీ సాంకేతిక కారణాలతో గోవా నుంచి రావాల్సిన ఆ విమానం రెండున్నర గంటలు ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎయిర్‌లైన్స్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎట్టకేలకు ఉదయం 8 గంటలకు గోవా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఇండిగో విమానం ప్రయాణికులతో తిరిగి ఉదయం 9.30 గంటలకు గోవా బయలుదేరి వెళ్లింది.

## కర్ణాటక మాజీ డీజీపీని చంపేసిన భార్య

### ముఖంపై కారం కొట్టి.. కత్తితో దాడి

### ఓంప్రకాశ్‌ని చంపేశానంటూ మరో ఐపీఎస్ భార్యకు ఫోన్ చేసిన వైనం.. హత్యలో కుమార్తెకూ భాగస్వామ్యం



**బెంగళూరు, ఏప్రిల్ 20 :** కర్ణాటక మాజీ డీజీపీ ఓంప్రకాశ్(68) దారుణ హత్యకు గురయ్యారు. బెంగళూరు నగరం హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని ఆయన నివాసంలోనే ఈ దారుణం జరిగింది. భార్య పల్లవి, కుమార్తె కృతి ఆయనను ముఖంపై కారం చల్లి కత్తితో పొడిచి చంపేసినట్టు తెలుస్తోంది. అనంతరం పల్లవి మరో ఐపీఎస్ అధికారి భార్యకు వీడియోకాల్ చేసి, రాక్షసుడిని చంపేశానంటూ మృతదేహాన్ని చూపించినట్టు సమాచారం. ఆస్తి తగాదాలే హత్యకు కారణంగా తెలుస్తోంది. పల్లవి ఆదివారం సాయంత్రం ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా హెచ్ఎస్ఆర్ లే అవుట్ పోలీసులు ఆయన ఇంటికి చేరుకొని రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. భార్య, కుమార్తెను బయటకు రావాలని పోలీసులు కోరినా చాలా సమయంపాటు వారు పైఅంతస్తులోనే ఉండడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. బిహార్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్ 1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. తొలుత బళ్లారి జిల్లా హరపనహళ్లిలో ఏఎస్పీగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసి 2015 నుంచి 2017 వరకు కర్ణాటక డీజీపీగా వ్యవహరించారు. రిటైర్మెంట్ తర్వాత బెంగళూరులోనే నివసిస్తున్నారు. భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవని ఇరుగు పొరుగువారు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. భార్య, కుమార్తెను పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకెళ్లారు.

**ఇంట్లో తుపాకీతో తిరుగుతున్నాడని..**

తన భర్త ఇంట్లో తుపాకీతో తిరుగుతున్నాడని, తనను చంపేస్తాడని భయంగా ఉందంటూ ఓంప్రకాశ్ భార్య పల్లవి మూడు రోజుల క్రితం ఐపీఎస్ ఫ్యామిలీ వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టారు. తనను, కుమార్తెను వేధిస్తున్నాడని, షూట్ చేస్తానంటూ హింసిస్తున్నాడని పేర్కొన్నారు. ఆయనపై సుమోటో కేసు నమోదు చేయాలని ఆ మెసేజ్‌లో ఆమె డిమాండ్ చేశారు.

## తన బిడ్డ ఏమైపోతుందోననే బెంగతో

### 4 ఏళ్ల కూతురికి విషమిచ్చి తానూ తాగిన తల్లి

### చిన్నారి మృతి..చావు బతుకుల మధ్య మహిళ

### అనారోగ్యాన్ని భరించలేక ఆత్మహత్యాయత్నం



**జీడిమెట్ల, ఏప్రిల్ 20 :** పుట్టుక నుంచి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ తల్లి.. తాను చనిపోతే కుమార్తె ఏమైపోతుందోనన్న బెంగతో బిడ్డతో సహా ఆత్మహత్యకు యత్నించింది. కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి చిన్నారికి తాగించి.. ఆపై తానూ అదే విషాన్ని మింగింది. ఈ క్రమంలో కుమార్తె మృతి చెంద గా.. తల్లి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో జరిగింది. గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందిన నంబూరి సాంబశివరావు.. బాపట్ల మండలం మిన్నేకల్లు గ్రామానికి చెందిన కృష్ణ పావని(33)కి తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన నాలుగేళ్లకు వీరికి పాప పుట్టింది. సాంబశివరావు హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పావని ఇంటి వద్దనే ఉంటూ కుమార్తెను చూసుకుంటోంది. పావని పుట్టుకతోనే మానసిక వ్యాధితో బాధపడుతోంది. నరాల బలహీనత, తీవ్ర కోపం వంటి సమస్యలతో ఆమె సతమవుతుండేది. ఇదే వ్యాధి తన కుమార్తె జశ్విని(4) కూడా ఉందన్న అనుమానం పావనిలో బలపడింది. ఈ బాధను భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న పావని.. తాను మరణిస్తే కుమార్తె భవిష్యత్ ఎమవుతుందోనని ఆందోళనకు గురైంది. ఈ క్రమంలో 18న భర్త ఉద్యోగానికి వెళ్లగా.. సాయంత్రం 4.30 గంటల సమయంలో కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి కుమార్తెకు తాగించి, తాను కూడా తాగింది. శనివారం తెల్లవారుజామున తల్లీ కూతుళ్ల పరిస్థితి విషమిస్తుండటంతో భర్తకు అనుమానం వచ్చి గట్టిగా నిలదీశాడు. దీంతో పావని జరిగిన విషయం చెప్పింది. వెంటనే సాంబశివరావు తల్లీ బిడ్డలను ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి జశ్విక చనిపోయింది. పావని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

# హైదరాబాద్‌లో ఎకో టౌన్

మొదటి పేజీ తరువాయి

పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకోనుంది. కాగా, కిటాక్యుషు నగర మేయర్ కజుహిసా టేకుచితో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు అధికారులు భేటీ అయ్యారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర నమూనాలు, నదుల పునరుజ్జీవ విధానాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈఎక్స్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్పీ, నిప్పాన్ స్టీల్ ఇంజనీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు సీఎం సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌పై తెలంగాణ ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యుషు మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు పడ్డ కిటాక్యూషు నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ టేకుచి వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు.

**పెట్టుబడులకు అనువైన వాతావరణం..**

పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వృద్ధి చెందిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితోపాటు తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన జపాన్ కంపెనీల పెట్టుబడులకు



అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్- కిటాక్యుషు నగరాల మధ్య విమాన ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయాలనే అంశం చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో జపనీస్ భాష పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జపాన్‌లో యువశక్తి అవసరం ఎక్కువగా ఉందని, మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కల్పిస్తే.. అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం మురాసాకి పునరుజ్జీవ ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కాసారంగా ఉన్న ఈ నది.. పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతకుముందు సీఎం రేవంత్ బృందానికి కిటాక్యుషులో స్థానిక సంప్రదాయ రీతిలో స్వాగతం లభించింది.

**నిర్బంధం బద్దలైంది.. ఇంద్రవెల్లి రెక్కలు విప్పుకొంది: రేవంత్**

జల్.. జంగిల్.. జమీన్ అంటూ హక్కుల కోసం పోరాడి, అసువులు బాసిన అడవి బిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. వారి పోరాటం సదా స్ఫూర్తిదాయకమన్నారు. ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఆయన ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "నాలుగు దశాబ్దాల నిర్బంధం బద్దలైంది. ఇంద్రవెల్లి స్వేచ్ఛగా రెక్కలు విప్పుకొంది. నాకు అండగా నిలిచి.. ఇంద్రవెల్లి కొండల్లో దండోరా మోగించిన ఆదివాసీలకు అన్నగా, ఆత్మీయులకు దన్నుగా తీసుకున్న నిర్ణయం స్వేచ్ఛ" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## ఆ రెండు పార్టీలు తెలంగాణకు శత్రువులే..

### ప్రజలకు రక్షణ గులాబీ జెండానే

### బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కంకణం

### వైఎస్ఆర్ తెచ్చిన ఆరోగ్య శ్రీ భేష్.. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన చంద్రబాబు వారిద్దరినీ అభినందించాల్సిందే: కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 20 :** "బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎసను లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నాయి. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు శత్రువులే. తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం గులాబీ జెండా. ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీయే" అని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వనం శ్రీరాంరెడ్డి తన అనుచరులతో కలిసి ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎసలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో కొత్త పార్టీలు వచ్చాయి.. పోయాయి.. రాజకీయ చరిత్రలో నిలిచిపోయిన పార్టీలు తెలుగుదేశం, బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి వచ్చిన వారి ఉత్సాహం చూస్తుంటే తొందరలోనే పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఎమ్మెల్యే అవుతాడనిపిస్తోందని చెప్పారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రులుగా పనిచేసిన దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం తీసుకువచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, చంద్రబాబు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు. వారిద్దరినీ అభినందించాల్సిందేనన్నారు. వాళ్లు తీసుకొచ్చిన పథకాలను తాము కొనసాగించామని, మంచి పనులను బీఆర్ఎస్ ఎప్పుడూ అడ్డుకోదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామంటూ.. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని అఘాతంలో పడేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల మాటలు పెద్దవి.. చేతలు చిన్నవి అన్నట్లు ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల ఇండ్లు, వ్యాపార సముదాయాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంటే ముట్టుకోరని, హైడ్రా పేరుతో పేదల ఇండ్లను మాత్రం కూల్చుతున్నారని ఆరోపించారు. తెలంగాణకు బీజేపీ ఒక్క మంచి పని చేయలేదని దుయ్యబట్టారు. మత పిచ్చి, కుల పిచ్చి తప్ప ఆ పార్టీకి మరొకటి లేదన్నారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'సమరశంఖ గర్జన గెరిల్లా ఉద్యమాల ఖిల్లా.. ఓరుగల్లు జిల్లా ' అంటూ సాగే పాటను కేటీఆర్ విడుదల చేశారు.



## వక్ఫ్ సవరణతో పేద ముస్లింలకు న్యాయం

### చట్టానికి వ్యతిరేకంగా బడా చోర్‌ల సభ

### ఆ సభకు అంతా సమకూర్చింది రేవంత్

### కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 20 :** పేద ముస్లింలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే కేంద్రం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం పెద్దపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. పేద ముస్లింలను దోచుకున్న ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బడా చోర్‌లందరూ కలిసి మీటింగ్ పెట్టారని విమర్శించారు. టైటిల్ డీడ్ లేని భూములను వక్ఫ్ పేరుతో ఆక్రమించుకున్న చరిత్ర ఎంఐఎం పార్టీదని మండిపడ్డారు. 8 లక్షల ఎకరాల భూమి, రూ.10 లక్షల కోట్ల సంపద ఉన్నా.. ఒక్క పేద వాడికి కూడా వక్ఫ్ సంస్థ ఉపయోగపడలేదని విమర్శించారు. తాము సభ పెడితే పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు.

శనివారం హైదరాబాద్‌లో జరిగిన సభకు కర్త, కర్మ, క్రియ రేవంత్‌రెడ్డి అని.. మీటింగ్‌కు నిధులు సమకూర్చింది కూడా ఆయనేనని ఆరోపించారు. మంచి ఉద్దేశంతో వక్ఫ్ సవరణ చట్టాన్ని తెస్తే మత కోణంలో ప్రతిపక్షాలు విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## బీజేపీ విధానాలపై కాంగ్రెస్ పోరు



### దేశవ్యాప్తంగా అధికార ప్రతినిధుల నియామకం

### తెలంగాణకు రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా

### ఏపీకి ఠాకూర్, సాల్మాన్ సోజ్.. కేరళకు కొప్పుల రాజు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 :** దేశవ్యాప్తంగా బీజేపీ విధానాలపై కాంగ్రెస్ ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. తొలివిడతలో మీడియా సమావేశాల ద్వారా బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆదివారం రాత్రి అన్ని రాష్ట్రాలకు 57 మంది అధికార ప్రతినిధులను ప్రకటించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. విజయవాడ-వారాణసీ, కాశ్మీర్-తిరువనంతపురం వరకు స్వాతంత్ర్య పోరాట సజీవ స్మారక చిహ్నాన్ని ధ్వంసం చేయడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ స్పష్టం చేసింది. సోమవారం నుంచి గురువారం(ఈనెల 24) వరకు దేశంలోని 57 నగరాల్లో మీడియా సమావేశాలను నిర్వహించేలా.. తాజాగా ప్రకటించిన అధికార ప్రతినిధులను ఆదేశించింది. తెలంగాణకు కాంగ్రెస్ సీనియర్ నేత రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా, ఆంధ్రప్రదేశ్‌కు సీనియర్ నేతలు మాణిక్కంఠాకూర్, సాల్మాన్ సోజ్, కేరళకు కొప్పుల రాజును నియమించింది. ఏపీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఝూరండ్, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు సహా పలు రాష్ట్రాలకు రెండు కంటే ఎక్కువ మంది నేతలను ఎంపిక చేసింది. వీరంతా నాలుగు రోజుల పాటు ఆయా రాష్ట్రాల్లో మీడియా సమావేశాల ద్వారా బీజేపీ తీరును ఎండగట్టనున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దర్యాప్తు సంస్థల కేసులపైనా నిజాలను ప్రజలకు వివరించాలని అధికార ప్రతినిధులకు సూచించింది.



## చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

**ప్రయోగాత్మక పరీక్ష విజయవంతం**

**సాధారణ బాంబు తరహాలోనే.. అయినా**

**తీవ్ర విధ్వంసం సృష్టించే సామర్థ్యం**

**బాంబు పేలినప్పుడు కొన్ని సెకన్ల పాటు భారీ అగ్నిగోళం**

**1000 డిగ్రీలకుపైగా వేడితో వినాశనం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది. రెండు కిలోల మెగ్నీషియం హైడ్రైడ్ వినియోగించిన పేలుడు పరికరాన్ని.. నియంత్రిత పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో పరీక్షించినట్టు వెల్లడించింది.
పేలుడు సమయంలో రెండు సెకన్ల పాటు 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతతో కూడిన అగ్నిగోళం ఏర్పడిందని.. అది సంప్రదాయ టీఎన్‌టీ పేలుడు కంటే 15 రెట్లు ఎక్కువని వివరించింది.

**మెగ్నీషియం హైడ్రైడ్ ఇంధనంగా..**

హైడ్రోజన్‌కు ఆక్సిజన్‌ను జతకలిపినప్పుడు రసాయన చర్య జరిగి నీటిగా మారుతుంది. ఈ క్రమంలో తీవ్రమైన ఉష్ణం వెలువడుతుంది. హైడ్రోజన్‌కు ఉన్న ఈ లక్షణాన్ని ఆధారంగా చేసుకుని బాంబు తయారీ కోసం ఎప్పటి నుంచో ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎక్కువ హైడ్రోజన్ ఒకచోట కావాలంటే.. దాన్ని తీవ్ర ఒత్తిడితో ట్యాంకులో నింపాల్సి ఉంటుంది. అలా బాంబు తయారు చేయడం కష్టం. ఈ క్రమంలోనే చైనా శాస్త్రవేత్తలు మెగ్నీషియం హైడ్రైడ్ పొడిని పేలుడు పదార్థంగా వాడి.. బాంబు తయారు చేశారు. ఈ బాంబు పేలడం మొదలవగానే.. మెగ్నీషియం హైడ్రైడ్ పొడి వెదజల్లినట్టుగా అవుతుంది. పేలుడు సమయంలో ఏర్పడే వేడికి కొంత మెగ్నీషియం హైడ్రైడ్ విడిపోయి.. హైడ్రోజన్ వాయువు వెలువడుతుంది. అది అంటుకుని మరింత వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ వేడికి మరింత మెగ్నీషియం హైడ్రైడ్ విడిపోయి.. హైడ్రోజన్ వెలువడటం, అది మండిపోయి మరింత వేడిని విడుదల చేయడం ఒక గొలుసుకట్టు చర్యగా జరుగుతుంది. ఈ క్రమంలో పేలుడు పదార్థమంతా మండిపోయేవరకు కొన్ని సెకన్ల పాటు వెయ్యి డిగ్రీల సెల్సియ్‌సకుపైగా ఉష్ణోగ్రతతో భారీ అగ్ని గోళం ఏర్పడుతుంది. అది విస్తరిస్తూ.. తీవ్ర విధ్వంసం సృష్టిస్తుంది. అతి తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా.. అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగిపోతాయి. దానితో రూపొందించే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ఇతర రక్షణ పరికరాలు తీవ్రంగా దెబ్బతింటాయి. నిజానికి మెగ్నీషియం హైడ్రైడ్‌ను వివిధ రంగాల్లో శక్తి ఉత్పాదన కోసం వినియోగించేందుకు అభివృద్ధి చేశారు. ఈ పదార్థాన్ని వేడి చేసినప్పుడు హైడ్రోజన్‌ను విడుదల చేస్తుంది. దాన్ని ఇంధనంగా వినియోగిస్తారు.

**అణ్వస్త్రాలకు బదులుగా..**

సాధారణంగా బాంబులలో టీఎన్‌టీ (ట్రై నైట్రో టోలిన్)ను పేలుడు పదార్థంగా వినియోగిస్తారు. దానికి కొంత పరిమితి ఉంటుంది. భారీ పేలుడు సృష్టించాలంటే ఎక్కువ స్థాయిలో టీఎన్‌టీని వినియోగించాల్సి ఉంటుంది. దీనికి బదులుగానే అణు బాంబులను అభివృద్ధి చేశారు. వాటి పేలుడు తీవ్రతతోపాటు అనంతరం రేడియేషన్ కారణంగా ఏర్పడే దుష్పరిమాణాలు ఎన్నో. ఈ క్రమంలోనే అణ్వస్త్రాల తరహాలో తీవ్ర విధ్వంసం సృష్టిస్తూనే.. తదనంతర దుష్ప్రభావాలు ఉండని బాంబుల రూపకల్పనపై అగ్రరాజ్యాలు దృష్టిపెట్టాయి. రష్యా, అమెరికాలు ఇప్పటికే ఈ తరహా బాంబులను రూపొందించాయి. తాజాగా చైనా ఆ తరహా బాంబును పరీక్షించింది.

## సైబర్ నేరగాళ్లకు కమీషన్‌పై ఖాతాల అందజేత

**ముంబై యువకుడిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు**



**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 :** సైబర్ నేరగాళ్లకు కమీషన్ పద్ధతిలో బ్యాంకు ఖాతాలు సమకూర్చుతూ సహకరిస్తున్న ముంబై యువకుడిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నవీ ముంబైలో ఉంటున్న రష్మిత్ రాజేంద్ర పాటిల్ (22) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి వారికి బ్యాంకు ఖాతాలు సమకూర్చడం మొదలుపెట్టాడు. సైబర్ నేరగాళ్లు తాము మోసం చేసి కాజేసిన సొమ్మును రష్మిత్ ఇచ్చిన ఖాతాలకు బదిలీ చేసేవారు. వాటిలోకి వచ్చిన డబ్బులో కొంత కమీషన్ తీసుకొని మిగతా డబ్బును వారు చెప్పిన ఖాతాలకు బదిలీ చేస్తున్నాడు. ఇదిలాఉండగా.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి (56)ని షేర్ మార్కెట్లో పెట్టుబడి పేరుతో మోసం చేసిన సైబర్ నేరగాళ్లు ఆయన నుంచి రూ.2.43 కోట్లు వసూలు చేశారు. ఈ డబ్బును రష్మిత్ అందించిన బ్యాంకు ఖాతాల్లో జమ చేయించారు. బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రష్మిత్ సమకూర్చిన బ్యాంకు ఖాతాల్లో బాధితుడి డబ్బు డిపాజిట్ అయినట్లు గుర్తించారు. సైబర్ క్రైం డీసీపీ కవిత దార ఆదేశాల మేరకు సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ పి. ప్రమోద్, ఎస్సై షేక్ అజీజ్‌ల బృందం ముంబై వెళ్లి నిందితుడు రష్మిత్‌ను అరెస్ట్ చేసి నగరానికి తరలించారు.

# ఆర్టీసీలో కొలువుల జాతర






**హైదరాబాద్, ఏప్రిల్ 20 :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ)లో త్వరలో కొలువుల జాతర ప్రారంభం కానున్నది. ఇప్పటికే 3,038 ఉద్యోగాలను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, త్వరలో నోటిఫికేషన్ జారీ అవుతుందని ఆదివారం ఓ ప్రకటనలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చాలా రోజుల తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీ ప్రారంభం కానుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీలో భారీస్థాయిలో ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలోనే ఈ ఉద్యోగాలు భర్తీ చేయాలని భావించినా.. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ కొనసాగుతుండటంతో ఆలస్యమైందన్నారు. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ పూర్తి కావడంతో ఉద్యోగాల భర్తీకి మార్గం సుగమమైందని చెప్పారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. దీంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని వెల్లడించారు. ఇప్పటిదాకా మహాలక్ష్మి పథకం కింద 165కోట్ల టికెట్లు జారీ చేయగా, రాష్ట్ర మహిళలకు రూ.5,500కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు కొత్త బస్సులు కొనుగోలు చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడ్డాక 60వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మరోసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి భారీగా ఉద్యోగాలను భర్తీ చేయనుందని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భర్తీ చేసే ఉద్యోగాలు : 3,038
డ్రైవర్: 2,000.. శ్రామిక్: 743
డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్): 84
డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానికల్): 114
డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్: 25
అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్: 18
అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్): 23
సెక్షన్ ఆఫీసర్ ( సివిల్): 11
అకౌంట్ ఆఫీసర్లు: 6
మెడికల్ ఆఫీసర్లు (జనరల్): 7
మెడికల్ ఆఫీసర్లు (స్పెషలిస్ట్): 7

# యాదగిరిగుట్టలో భక్తుల సందడి

**దర్శించుకున్న 45వేల మంది భక్తులు.. రాముయ్యను దర్శించుకున్న సీపీ ఆనంద్**




**యాదగిరిగుట్ట, భద్రాచలం ఏప్రిల్ 20 :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు దినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులతో కొండపైన ఆలయ తిరువీధులు, స్వామివారి ఉభయ దర్శనాల క్యూలైన్లు నిండిపోయాయి. ధర్మదర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 45వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. మరోవైపు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామిని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు డీజీ సీవీ ఆనంద్‌కు ఆశీర్వచనం చేశారు.

# ఆ అధికారిని రిటైరయ్యాక కొనసాగించండి

**సీఎం రేవంత్‌కు ఓ కీలక శాఖ మంత్రి లేఖ**

**ఈ నెల 30న రిటైరవుతున్న సదరు ఎస్‌ఈ**

**హైదరాబాద్, ఏప్రిల్ 20 :** ఉద్యోగ విరమణ తర్వాత ఆయా శాఖల్లో కొనసాగుతున్న, కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగే వారిని ప్రభుత్వం తొలగిస్తోంది. అయితే ఓ కీలక శాఖలో పూర్తి అదనపు బాధ్యతల్లో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)గా పనిచేస్తున్న అధికారిని రిటైరయ్యాక కూడా కొనసాగించాలంటూ ఓ మంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. తన శాఖకు అనుబంధంగా ఉండే ఓ విభాగానికి ఎస్‌ఈగా ఉన్న సదరు అధికారి ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్నారని, అయితే ఆ విభాగంలో ఇంకా నిర్వహించాల్సిన పనులు చాలా ఉన్నాయని, అందులో ప్రభుత్వం "సూపర్ గేమ్ చేంజర్"గా భావిస్తున్న ప్రాజెక్టు కూడా ఉందని లేఖలో తెలిపారు. ఆయా పనులను సక్రమంగా, వేగంగా జరిపేందుకు సదరు అధికారి అవసరమని, పదవీ విరమణ తర్వాత కూడా శాఖలో ఆయన కొనసాగేలా అవకాశమివ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో జాతీయ ప్రాజెక్టులు ఆశించిన సమయానికి పూర్తయ్యేందుకుగాను ఢిల్లీ అ2ధికారులతో పరిచయమున్న ఈ అధికారి అవసరమని తెలిపారు. ఏడాదిపాటు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ ఈ నెల 8న మంత్రి లేఖ రాయగా తాజాగా అది వెలుగులోకి వచ్చింది. సీఎం ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్నందున దీనిపై ఆయన ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. రిటైరైన వాళ్లను ప్రభుత్వం వద్దని పంపిస్తుంటే మంత్రి ఇలా సీఎంకు లేఖ రాయడం పట్ల శాఖలో చర్చ జరుగుతోంది.



## నేషనల్ హెరాల్డ్ కేసు కాంగ్రెస్‌ను భయపెట్టడానికే

**బిహార్ బహిరంగ సభలో ఖర్గే**

బక్సర్, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీని భయపెట్టేందుకే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను చేర్చిందని ఏఐసీసీ చీఫ్ ఖర్గే ఆరోపించారు. బిహార్‌లోని బక్సర్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ తాము ఎవ్వరికీ భయపడబోమన్నారు. ఈ కేసులో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సోదాలు చేపట్టాయని, వారికి ఏమీ దొరకలేదని చెప్పారు. బిహార్‌లో అధికారం కోసం సీఎం నితీశ్ పార్టీలు మారుతుంటారని ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ బిహార్‌కు ఇస్తామన్న 1.25 లక్షల కోట్ల ప్యాకేజీ సంగతి ఏమైందని ఖర్గే ప్రశ్నించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేను ఓడించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో బీజేపీ అబద్ధాలను వెల్లడించేందుకు ఈ నెల 21 నుంచి 24 వరకు 57 నగరాల్లో కాంగ్రెస్ నేతలు ప్రెస్ కాన్ఫరెన్సులు నిర్వహిస్తారని ఆ పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా తెలిపారు.

## ప్లీజ్ పాస్ చేయండి నా ప్రేమ మీ చేతుల్లో ఉంది

**జవాబు పత్రంలో పదో తరగతి విద్యార్థి అభ్యర్థన**

**బెంగళూరు, ఏప్రిల్ 20 :** పరీక్షల్లో భిన్నమైన అంశాలను ప్రస్తావిస్తూ కొందరు విద్యార్థులు రాస్తుంటారు. అటువంటిదే బెళగావి జిల్లా చిక్కోడిలో ఏర్పాటు చేసిన పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. ఓ విద్యార్థి జవాబు పత్రంలో విచిత్ర సందేశాన్ని చూసి అక్కడున్నవారు ఆశ్చర్యానికి లోనయ్యారు. పదో తరగతి పాస్ అయితేనే నీతో ప్రేమ కొనసాగిస్తానని ప్రియురాలు చెప్పిందని ఏకంగా విద్యార్థి ఆన్సర్‌షీట్‌లో రాశాడు. 'నా ప్రేమ మీ చేతుల్లో ఉంది.. అమ్మాయి ప్రేమ కొనసాగాలంటే నేను పాస్ కావాలి సార్/మేడం. దయచేసి పాస్ చేయండి. ఈ 500తో టీ తాగండి, నన్ను పాస్ చేయండి' అంటూ ఆన్సర్‌షీట్ల మధ్యన 500 రూపాయల నోటు జత చేశాడు.

# అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై న్యాయపోరాటం

**కోర్టు మెట్లెక్కిన భారత్, చైనా విద్యార్థులు**

**తమ స్టూడెంట్ వీసా రద్దును సవాలు చేస్తూ కేసులు**

**నిర్బంధాలు, బహిష్కరణలను తక్షణం నిలిపివేయాలని వినతి**

**ట్రంప్ తీరుకు నిరసనగా మరోసారి రోడ్లపైకి అమెరికన్లు**

**అమెరికా వ్యాప్తంగా పలు నగరాల్లో భారీ ర్యాలీలు**



**వాషింగ్టన్, ఏప్రిల్ 20:** అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై అమెరికాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలసదారుల బహిష్కరణ అంశంతో పాటు విశ్వవిద్యాలయాలపై ఆయన వైఖరి పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు నిరసనల స్థాయిని దాటి కోర్టుల్లో కేసులు వేసే స్థాయికి చేరుకుంది. ఎఫ్-1 విద్యార్థి వీసాల రద్దుకు నిరసనగా అమెరికాలో భారత్, చైనా విద్యార్థులు చేతులు కలిపారు. ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని ముగ్గురు భారతీయ విద్యార్థులు, ఇద్దరు చైనా విద్యార్థులు కోర్టులో సవాలు చేశారు. డీహెచ్ఎస్, ఇమిగ్రేషన్ అధికారులపై న్యూహాంపషైర్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ ఎఫ్-1 హోదాను అధికారులు ఏకపక్షంగా రద్దు చేశారని, దీనివల్ల తమ భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయిందని, వీసాలు రద్దు చేసేముందు ప్రభుత్వం తమకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని ఆరోపించారు. విద్యార్థి వీసాను చట్టవిరుద్ధంగా రద్దు చేయడం వల్ల నిర్బంధం, బహిష్కరణ ముప్పుతో పాటు ఓపీటీకి అనర్హులు కావడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.

తమతో పాటు విదేశీ విద్యార్థుల వీసాలన్నీ పునరుద్ధరించాలని, నిర్బంధాలు, బహిష్కరణలను తక్షణం నిలిపివేయాలని కోరారు. ఈ వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకొని ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు.

కాగా, ట్రంప్ యంత్రాంగంపై కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ముగ్గురు భారతీయ విద్యార్థులు రివియర్ యూనివర్సిటీ (న్యూహాంపషైర్)లో చదువుతున్నారు. వీరిలో లింఖిత్ బాబు గొర్రెల గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకొని మే 20 నుంచి మాస్టర్స్ డిగ్రీలో చేరాల్సి ఉంది. ఇక మణికంఠ పసుల, తనూజ్ కుమార్ గుమ్మడవెల్లిల మాస్టర్స్ డిగ్రీ పూర్తికావడానికి మరో సెమిస్టర్ మాత్రమే మిగిలి ఉంది. ఇదిలా ఉండగా, ట్రంప్ విధానాలను నిరసిస్తూ అమెరికా వ్యాప్తంగా ప్రజలు 15 రోజుల వ్యవధిలోనే మరోసారి రోడ్డెక్కారు. శనివారం వేలాది మంది నిరసనకారులు పలు నగరాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. ప్రతీకార సుంకాలు, వలసదారుల బహిష్కరణ, ఇమిగ్రేషన్, ఆర్థిక విధానాలు, ఫెడరల్ ఉద్యోగాల్లో కోతలు తదితర అంశాలపై ఆందోళనకారులు తీవ్రంగా మండిపడ్డారు. అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్దకు ర్యాలీగా చేరుకున్న నిరసనకారులు ట్రంప్ ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, 'సిగ్గుచేటు' అంటూ నినాదాలు చేశారు.



## ఢిల్లీలో కుప్పకూలిన 4 అంతస్తుల భవనం

***11 మంది దుర్మరణం, 11 మందికి గాయాలు***

***తెల్లవారుజామున ముస్తఫాబాద్‌లో ఘటన***

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర విషాద ఘటన చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలో తెల్లవారుజామున ఓ బహుళ అంతస్తుల నివాస భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా 11 మంది దుర్మరణం చెందారు. మరో 11 మంది గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), అగ్ని మాపక సిబ్బంది, ఢిల్లీ పోలీసులు, వాలంటీర్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీసేందుకు 12 గంటలకుపైగా శ్రమించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ముస్తఫాబాద్ ఏరియాలో ఉన్న 20 ఏళ్ల నాటి నాలుగంతస్తుల భవనం కుప్పకూలింది. ఘటన జరిగినప్పుడు భవనంలో 22 మంది ఉన్నారు. ఇందులోనే భవన యజమాని తెహసీన్‌తోపాటు ఆయన కుటుంబసభ్యులు నివసిస్తున్నారు. భవనం కూలిపోవడంతో తెహసీన్, మరో ఆరుగురు కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు మూడు దుకాణాలకు సంబంధించిన నిర్మాణ పనుల కారణంగా భవనం కూలిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కొత్త దుకాణంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఇవే భవనం కూలిపోవడానికి దారితీసి ఉండవచ్చని స్థానికులు కూడా వాపోతున్నారు. భవనం కూలిపోవడంతో పొరుగున ఉన్న ఇళ్ల వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ దుర్ఘటన పట్ల ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

## మోదీ... మా దేశానికి రండి



**బీజింగ్, ఏప్రిల్ 20:** అమెరికాతో వాణిజ్య యుద్ధం ముదురుతున్న వేళ పొరుగు దేశం చైనా స్వరం మారుతోంది. భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి డ్రాగన్ ఇప్పుడు స్నేహ హస్తం చాపుతోంది. భారత్, ఇతర సభ్య దేశాలతో కలసి షాంఘై సహకార సంస్థ(ఎససీవో)కు నాయకత్వం వహించడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఏడాది తమ దేశంలో పర్యటించాలని ప్రధాని మోదీని ఆహ్వానించింది. ప్రతీకార సుంకాలతో బీజింగ్, వాషింగ్టన్ మధ్య సంబంధాలు క్షీణిస్తున్న దశలో చైనా వైఖరిలో ఈ మార్పు రావడం గమనార్హం.

## నా అస్థికలు మురుగు కాలువలో కలిపేయండి

**యూపీలో భార్యా బాధితుడి ఆత్మహత్య**

**భార్య, అత్తింటివారి వేధింపులు తాళలేక భర్త బలన్మరణం**

**వేధింపుల కేసు పెడతామని బెదిరిస్తున్నారని సెల్ఫీ వీడియో**

**న్యాయం జరగకపోతే అస్థికలు కాలువలో కలపాలని ఆవేదన**

లఖ్‌నవూ, ఏప్రిల్ 20: మహిళలు పెడుతున్న తప్పుడు కేసుల నుంచి పురుషులకు రక్షణ కల్పించాలనే అభిప్రాయాలు రోజురోజుకి అధికమవుతున్న వేళ ఓ దారుణం వెలుగు చూసింది. ఆస్తి రాసివ్వకపోతే వరకట్నం వేధింపుల కేసు పెడతామని భార్య, అత్తింటి వారు చేస్తోన్న వేధింపులు తాళలేక ఓ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయిన తర్వాత కూడా తనకు న్యాయం జరగకపోతే తన అస్థికలను మురికి కాలువలో కలిపేయండని ఆత్మహత్యకు ముందుకు తీసుకున్న సెల్ఫీ వీడియోలో తల్లిదండ్రులను కోరాడు. ఉత్తరప్రదేశ్ ఇటావాలో జరిగిన ఈ ఘటనలో మోహిత్ యాదవ్(33) అనే ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ హోటల్ గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దాని కంటే ముందు ఓ సెల్ఫీ వీడియోలో తన ఆత్మహత్యకు కారణాన్ని వెల్లడించి ఆ వీడియోను కుటుంబసభ్యులకు పంపాడు. మోహిత్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్న ప్రకారం.. యూపీలోని అరాయియా జిల్లాకు చెందిన మోహిత్, ప్రియ ఏడేళ్లు ప్రేమించుకున్న తర్వాత 2023లో పెళ్లి చేసుకున్నారు. మోహిత్ ఓ సిమెంట్ పరిశ్రమలో ఫీల్డ్ ఇంజనీర్ కాగా, బిహార్‌లోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో రెండు నెలల క్రితం ప్రియకు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది.

ఆ సమయంలో ప్రియ గర్భంతో ఉండగా.. ఆమె తల్లి గర్భస్రావం చేయించింది. ప్రియకు సంబంధించిన ఆభరణాలన్నీ ఆమె తల్లి తన వద్దే ఉంచుకుంది. కాగా, పెళ్లి సమయంలో మోహిత్ అత్తింటి వారిని కట్నం అడగలేదు. కానీ, ఇల్లు, ఇతర ఆస్తులను ప్రియ పేరిట రాసివ్వకపోతే వరకట్నం కోసం వేధిస్తున్నారని కేసు పెడతామని ప్రియ, ఆమె కుటుంబం ఇటీవల మోహిత్ కుటుంబాన్ని వేధిస్తోంది. ప్రియ తండ్రి.. మోహిత్‌పై ఇప్పటికే ఓ తప్పుడు కేసు పెట్టగా, చంపేస్తానంటూ ఆమె సోదరుడు కూడా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. రోజురోజుకి ఈ వేధింపులు అధికమవ్వడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని తల్లిదండ్రులకు మోహిత్ క్షమాపణలు చెప్పాడు. పురుషుల కోసం చట్టాలు ఉండుంటే తాను ఈ నిర్ణయం తీసుకునే వాడిని కాదని మోహిత్ ఆవేదన వ్యక్తం చేశాడు. చావు తర్వాత కూడా న్యాయం జరగకపోతే తన అస్థికలను మురుగు కాలువలో కలపాలని తల్లిదండ్రులను కోరాడు. కాగా, ఈ ఘటనపై పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది.





## అమెరికాకు తగ్గిన విమాన చార్జీలు

**ఈ వేసవిలో ఢిల్లీ-అమెరికా టికెట్ ధరలు 15% పడిపోయిన వైనం.. ట్రంప్ విధానాలే కారణం**

**ముంబై, ఏప్రిల్ 20:** ఈ వేసవిలో ఆశ్చర్యకరంగా అమెరికాకు విమాన చార్జీలు పడిపోయాయి. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అనుసరిస్తున్న విధానాల కారణంగానే ఈ ట్రెండ్ చోటుచేసుకుందని అంటున్నారు. ఢిల్లీ-అమెరికా విమానాల చార్జీలు 10 నుంచి 15 శాతం వరకు తగ్గాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య కాలానికి సంబంధించి ఢిల్లీ, ముంబై నుంచి అమెరికాలోని కీలక నగరాలకు విమాన చార్జీల్లో సగటున 5-8 శాతం తగ్గుదల కనిపిస్తోందని ట్రావెల్ సంస్థ 'థామస్ కుక్ (భారత్) అండ్ ఎస్‌వోటీసీ ట్రావెల్' ప్రెసిడెంట్, గ్రూపు హెడ్ ఇండైవర్ రస్తోగి పేర్కొన్నారు. శనివారం ఉన్న ధరల ప్రకారం.. మే నెల మధ్యలో ముంబై నుంచి న్యూయార్క్‌కు వన్‌వే ప్రయాణానికి టికెట్ ధర కనిష్ఠంగా రూ.37 వేలు చూపించడం గమనార్హం. అదేవిధంగా చౌకైన తిరుగు ప్రయాణ చార్జీ రూ.76 వేలుగా ఉంది. అమెరికాలో రెండవ అతిపెద్ద వలస సమాజంగా భారతీయులు ఉన్నారు. అక్కడ ఉన్న వాళ్లు భారత్‌లోని తల్లిదండ్రులను చూడటానికి లేదా ఇక్కడ ఉన్న తల్లిదండ్రులు అమెరికాలోని తమ పిల్లలను చూసేందుకు, విద్యాసంస్థలకు వేసవి సెలవుల సీజన్‌లో ప్రయాణాలు చేస్తుంటారు. అదేవిధంగా ఉన్నత విద్య కోసం భారతీయులు భారీగా అమెరికాకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో అమెరికాకు వెళ్లే విమాన సర్వీసులకు ఏడాది అంతా విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో గత కొన్నేళ్లుగా భారత్, అమెరికా మధ్య నడిచే విమానాల్లో చార్జీలు కూడా ఎక్కువగా ఉండేవి. అయితే ట్రంప్ విధానాలతో ఈ వేసవిలో సీన్ మారిపోయింది.

## మహిళ అంటే...

**బ్రిటన్ సుప్రీంకోర్టు తీర్పుపై నిరసన వెల్లువ**


**హక్కులు కోల్పోతామని ట్రాన్స్‌జెండర్ల ఆందోళన..వేలాదిమంది ర్యాలీ**



**లండన్, ఏప్రిల్ 20:** మహిళ నిర్వచనం గురించి బ్రిటన్ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై నిరసన వెల్లువెత్తింది. లండన్‌లోని పార్లమెంటు స్క్వేర్ వద్ద ఆదివారం వేలాది మంది ట్రాన్స్‌జెండర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. పుట్టుకతో ఉన్న లింగం ఆధారంగానే మహిళగా పరిగణించాలని, లింగమార్పిడి చేయించుకున్నవారికి ఈ నిర్వచనం వర్తించదని బ్రిటన్ సుప్రీంకోర్టు గత బుధవారం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు వల్ల తాము హక్కులను కోల్పోతామని ఆందోళనకు గురైన ట్రాన్స్‌జెండర్లు మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, ఆస్పత్రి వార్డులు తదితర సేవలను వినియోగించుకునే విషయంలో ఈ తీర్పు ప్రభావం చూపనుందని వారంతా ఆందోళన చెందుతున్నారు. పుట్టుకతో ఉన్న లింగం ఆధారంగానే ఈ సేవలన్నీ వర్తిస్తాయని కోర్టు పేర్కొనడమే దీనికి కారణం. ఈ తీర్పు అనంతరం స్త్రీల మరుగుదొడ్లను లింగమార్పిడి మహిళలు వినియోగించుకోలేరని, ఆస్పత్రిలోని మహిళా వార్డులు, మహిళా క్రీడా బృందాల్లోనూ వారికి చోటు దక్కకపోవచ్చని సమానత్వ-మానవ హక్కుల కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. స్కాట్లాండ్ పాలక మండళ్లలో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పిస్తూ 2018లో స్కాట్లాండ్ పార్లమెంటు చేసిన చట్టం నేపథ్యంలోనే తాజా తీర్పు వెలువడింది. ట్రాన్స్‌జెండర్ మహిళలు కూడా లింగనిర్ధారణ సర్టిఫికెట్‌తో ఆ కోటాను వినియోగించుకోవచ్చని పార్లమెంటు పేర్కొనడంపై కోర్టు విభేదించింది. లింగ నిర్ధారణ సర్టిఫికెట్ల వల్ల స్త్రీ, పురుష నిర్వచనాల్లో గందరగోళం నెలకొందన్న కోర్టు.. 2010 సమానత్వ చట్టం పేర్కొన్న వివక్ష వ్యతిరేక నిబంధనల్లో పుట్టుకతో వచ్చిన లింగాన్నే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టీకరించినట్టు తెలిపింది.

## ఏటీఎంలో బంగారం వేస్తే బ్యాంకు ఖాతాలో నగదు జమ

**చైనాలో నూతన ఆవిష్కరణ**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:** వినూత్న ఆవిష్కరణల్లో ముందున్న చైనా మరో ప్రయోగాన్ని చేసింది. ఎవరైనా ఏటీఎంలో తమ బంగారాన్ని వేస్తే దాని మార్కెట్ విలువ సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమయ్యేలా ఏర్పాట్లు చేసింది. షాంఘైలో 'గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం'ను నెలకొల్పింది. ఎవరైనా తమ వద్ద ఉన్న బంగారం నగలు, కాసులు వంటివి ఈ ఏటీఎంలో జమ చేయవచ్చు. వెంటనే దాన్ని కరిగించి స్వచ్ఛతను లెక్కిస్తుంది. అత్యాధునిక తూనిక విధానం ద్వారా దాని బరువును కొలుస్తుంది. ఆ రోజుకు ఉన్న మార్కెట్ ధరల ప్రకారం దాని విలువను లెక్కిస్తుంది. ఆ సొమ్మును సంబంధిత వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఇదంతా నిమిషాల వ్యవధిలో జరిగిపోతుంది.

# పాత్రికేయుని కుటుంబానికి పరామర్శ



**హుజురాబాద్ ఏప్రిల్ 20 జనతా న్యూస్:** హుజురాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు తిరునగరి ఆంజనేయస్వామి, హాన్స్ ఇండియా స్టాఫ్ రిపోర్టర్ తిరునగరి వెంకటేశ్వర స్వామి తల్లి శేషమ్మ ఇటీవల మృతి చెందింది. కాగా ఆదివారం దశదినకర్మ జరిగింది. దీనికి వరంగల్ పూర్వ జిల్లా సాక్షి బ్యూరో ఇన్చార్జి గడ్డం రాజిరెడ్డి, సీనియర్ పాత్రికేయులు కోరెం సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, పి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావులకార్ వెంకట్, సీనియర్ పాత్రికేయులు కేసరి మధుకర్, వేణుమాధవ్, చిర్ర సుదర్శన్ గౌడ్, పొన్నోజు సంతోష్ కుమార్ తదితరులు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె మృతికి సంతాపాన్ని వ్యక్తం చేసి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

# వేములవాడలో బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవస్థలు

**వేములవాడ, జనతా న్యూస్:** ప్రభుత్వ రంగ సంస్థ అయిన అటువంటి బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ ఆదివారం ఉదయం నుండి సిగ్నల్స్ లేకపోవడం వల్ల బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు చాలా ఇబ్బంది పడ్డారు 4%స్త్ర 5స్త్ర% అంటూ ఊకదంపుడు ప్రకటనలు తప్ప నెట్వర్క్లో ప్రాబ్లమ్స్ లేకుండా సేవలు అందించడం లేదని ప్రజలు ఆగ్రహిస్తున్నారు ఇలాంటి ఇబ్బందుల వల్లనే ప్రజలందరూ మిగతా ప్రవేట్ రంగ సంస్థలైన జియో ఎయిర్టెల్ వాటికి మారుతున్నారని అంటున్నారు

# ప్రజావాణి రద్దు

**కరీంనగర్, జనతా న్యూస్:** కరీంనగర్ కలెక్టరేట్లో సోమవారం (21.04.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూభారతి కొత్త ఆర్ఓఆర్ రెవిన్యూ చట్టం అమలు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందున, అధికారులంతా ఆ సదస్సులకు హాజరు కావలసిన ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షికోత్సవ కళ్యాణ కరపత్ర ఆవిష్కరణ



**జనతా న్యూస్, నకిరేకల్ :** శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షికోత్సవ కళ్యాణ ఆహ్వాన కరపత్రాలను ఆదివారం స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం తన నివాసంలో ఆవిష్కరించారు. మే 5,6 తేదీలలో వివిధ పూజ కార్యక్రమాలు,7న స్వామివారి వార్షికోత్సవ కళ్యాణం ఉంటాయని తెలిపారు భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోనీ రజిత శ్రీనివాస్, కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్,యాసారపు లక్ష్మి వెంకన్న ఆలయ కమిటీ చైర్మన్ మోపూరి చంద్రమౌళి, ఉపాధ్యక్షులు సంకోజు నారాయణ, ప్రధాన కార్యదర్శి సిద్దోజు భిక్షమాచారి ,కమిటీ సభ్యులు తర్నోజు కృష్ణమాచారి, శ్రీరామోజు మురళి, బసవోజు నాగ చారి ,కొత్తోజు సత్యనారాయణ, జూలూరి యజ్ఞ చారి గడ గోజు ,రవీంద్ర చారి పాల్గొన్నారు

# అవినీతి ఆరోపణలతో జనగామలో ఇద్దరు పోలీసుల సస్పెండ్

**జనతా న్యూస్, జనగామ :** అవినీతి ఆరోపణల పై జనగామ జిల్లా తరిగొప్పుల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ తో పాటు మరొక కానిస్టేబుల్ ను వరంగల్ పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం సస్పెండ్ చేశారు . తరిగొప్పుల పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మరోకానిస్టేబుల్ తో కలసి ఓ కేసు విషయంలో నిందితుడికి సహకారం అందించేందుకు గాను నిందితుడి నుండి డబ్బులు డిమాండ్ చేసినట్లుగా వచ్చిన ఆరోపణల పై పోలీస్ అధికారి చేపట్టిన విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో ఆ హెడ్ కానిస్టేబుల్ తో పాటు కానిస్టేబుల్ ను కూడా సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం కఠినమైన ఉత్తర్వులు చేయడంతో అవినీతికి పాల్పడుతున్న పోలీసు సిబ్బంది వణుకుతున్నారు. జనగామ జిల్లాలో అవినీతికి పాల్పడుతున్న కొద్దిమంది పోలీసులు బినామీల ద్వారా తమ అవినీతి లావాదేవీలు జరుపుతున్నారని ఈ సందర్భంగా పలువురు చర్చించుకుంటున్నారు

# భూభారతితో శాశ్వత పరిష్కారం లభించేనా..!

- ధరణితో అవస్థలు పడ్డ రైతులు
- పూర్తిస్థాయిలో పరిష్కారం కాని సాదాబైనామాలు
- భూ భారతిపైనే రైతుల ఆశలు
- రాష్ట్రంలో నాలుగు మండలాలు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక
- నేడు నల్గొండ జిల్లా కు రెవెన్యూ శాఖ మంత్రి రాక
- ఇప్పటికే మండలాల్లో ఎమ్మెల్యేలతో కలిసి రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్




**జనతా న్యూస్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలుపుతామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీల తో పాటు ఇచ్చిన హామీల్లో ధరణిపోర్టలు రద్దుచేయడం ఒక హామీగా ఇచ్చారు. అనుకున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ధరణి పోర్టల్ ను రద్దుచేయడానికి, బంగాళాఖాతంలో కలపడానికి ఏడాదికిపైగా సమయం పట్టింది. ఏదేమైతేనేం మొత్తానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా ధరణి పోర్టల్ రద్దుచేశారు. భూభారతి చట్టని అమలులోకి తెచ్చారు. భూభారతిని అమలుచేసేందుకు రాష్ట్రంలోని నాలుగు జిల్లాలలోని నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలోని పలు మండలాలలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నియోజకవర్గ ఎమ్మెల్యేలతో కలిసి భూభారతి చట్టం పై అవగాహన కల్పిస్తున్నారు. కాగా నేడు రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని చందంపేట మండలానికి వస్తున్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేయబోతున్న భూభారతి చట్టం 2025 పై రైతులకు అవగాహన కల్పించి అమలుచేసే దిశగా నిర్దేశం చేయనున్నారు.

**భూ భారతి తో భూవివాదాలకు చెక్ పడినట్లేనా..?**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన ధరణి పోర్టల్ తో ప్రతి గ్రామంలో ప్రతిరైతుకు ఏదో ఒక సమస్య ఎదురైంది. ఏ ఒక్కరికి కూడా ధరణి పోర్టల్ ద్వారా భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టాలు ఉన్న భూములు ధరణి పోర్టల్ రాకతో అటవీ భూములుగా, ప్రభుత్వ భూములుగా, బీనాం భూములుగా, సీలింగ్ భూములుగా ఇలా రకరకాల కారణాలతో రైతులు సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి కూడా భూ సమస్యలే ఎక్కువగా రావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల తో పాటు ఇతర హామీలు ఇచ్చినప్పటికీ, ధరణి పోర్టల్ ను రద్దుచేసి బంగాళాఖాతంలో కలుపుతామని చెప్పడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నరు. అయితే ప్రస్తుతం దశాబ్దాలుగా కూరుకపోయిన భూసమస్యల పరిష్కారానికి భూభారతి ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందనే భరోసాను రైతులకు కలిగించే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తుంది. పెండింగ్ లో ఉన్న భూ సమస్యలన్నీ భూభారతి చట్టం ద్వారా పరిష్కారమవుతుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**మొదలైన అవగాహన సదస్సులు...**

భూభారతి చట్టం తో అత్యంత ప్రతిష్టాత్మకంగా, అత్యంత గొప్ప పథకంగా ప్రజల్లోకి, ముఖ్యంగా రైతుల్లోకి తీసుకపోతున్నది. చాలా ఏండ్లుగా పరిష్కారం కాకుండా పెండింగ్ లో ఉన్న భూ సమస్యలకు భూభారతి పరిష్కారం చూపుతుందని, రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి చట్టం అని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నియోజకవర్గ ఎమ్మెల్యేలు రైతులకు చెబుతున్నారు. భూభారతి చట్టని తీసుకొచ్చిన నాటి నుండి జిల్లా కలెక్టర్ త్రిపాఠి నిరంతరయంగా నల్లగొండ జిల్లాలోని నియోజక వర్గాలలో పర్యటనలు చేస్తూ స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ధరణితో ఏమి కోలుపోయారు.. భూభారతితో ఏం పొందనున్నారు... అనే విషయంపైన జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, జిల్లా, మండల అధికారులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి భూభారతి ప్రత్యేతను, ప్రాముఖ్యతను, పెండింగ్ సమస్యలకు పరిష్కారం ఏవిధంగా లభిస్తుందో.. అర్థమయ్యేలా వివరిస్తున్నారు.

**17 నుండి నిరంతరాయంగా...**

ఈనెల 17న నల్లగొండ జిల్లాలోని దేవరకొండ లో గల చింతపల్లిలో భూభారతి చట్టంపై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజలకు అవగాహన కల్పించారు. అదే రోజు దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తోకలిసి దేవరకొండ తో పాటు కొండమల్లేపల్లిలో అవగాహన కల్పించారు. 19న నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర, హాలియా లో ఎమ్మెల్యే జై వీర్ రెడ్డితో కలిసి అవగాహన కల్పించారు. 20న నల్లగొండ మండలం దోమలపల్లి, అదేవిధంగా తిప్పర్తి మండలం లో భూ భారతి చట్టంపై జిల్లా కలెక్టర్ త్రిపాఠి ప్రజలకు అవగాహన కల్పించారు.

**భూభారతి తో పెండింగ్ సాదాబైనామాలకు మోక్షం..**

సాదా బైనామాలను క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. సాదాబైనామాలతో పట్టాలు ఇవ్వడంతో మెజార్టీ రైతులకు మేలు జరిగింది. అయితే పూర్తిస్థాయిలో సాదాబైనామాలు క్రమబ కాలేదు. రైతులు తమ సమస్యలను పరిష్కరించు కోలేకపోయారు. 2020 లో మరోసారి పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి దరఖాస్తులు కోరారు. లక్షల సంఖ్యలో సాదా బైనమాలు పరిష్కారం కాలేదని ఫిర్యాదులు వచ్చాయి. కానీ వాటికీ పరిష్కారం మాత్రం చూపలేదు. ఇలోగా ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం బిఆర్ఎస్ అమలుచేసిన ధరణి పోర్టల్ రద్దు కీలకంగా చెప్పుకోవచ్చు. అయితే పెండింగ్ ఉన్న సాదాబైనామాలకు, ఇతర రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు, ఎమ్మెల్యేలు రైతులకు భరోసా ఇస్తున్నారు. రెవెన్యూ, అటవీశాఖల మధ్యలో ఉన్న వివాదాస్పద భూములు భూభారతితో పరిష్కారం అవుతుందని ఆశగా ప్రజలు, ముఖ్యంగా రైతులు ఎదురుచూస్తున్నారు.

# పవిత్రమైన వైద్య వృత్తిలో ఆదర్శం కావాలి




**ప్రభుత్వ విప్ డా. రామచంద్రు నాయక్**

**ఐ ఎం ఏ. జనగామ అధ్యక్షునిగా డా. జె. బాలాజీ**

**ఎమ్మెల్యే పల్లా తో పాటు ప్రముఖుల అభినందనలు**

**జనతా న్యూస్, జనగామ :** ఎంతో పవిత్రమైన వైద్య వృత్తి లో డాక్టర్లు ఆదర్శంగా నిలవాలని, కొత్తగా వచ్చే వారికీ సీనియర్లు చక్కని మార్గదర్శనం చేసి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంస్థలో జనగామ శాఖ ఆదర్శవంతమైన శాఖ గా గుర్తింపు పొందాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ డా. జె. రామచంద్రు నాయక్ సూచించారు. శనివారం రాత్రి జనగామలో ఐ ఎం ఏ జనగామ శాఖ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో డా. రామచంద్రు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నూతనంగా ఐ ఎం ఏ జనగామ శాఖ అధ్యక్షుడు గా ఎన్నికైన డా. జె. బాలాజీ ని అలాగే నూతన కమిటీని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తో పాటు అనేక మంది ప్రముఖులు అభినందిస్తూ తమ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం రాత్రి డాక్టర్ బాలాజీ అధ్యక్షతన జనగామలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఏ సంస్థలోనైనా పరస్పర సహకార భావం కలిగి ఉంటే ప్రగతి సాధన సుసాధ్యం అన్నారు. తాను వృత్తి రీత్యా డాక్టర్ ను అని అంటూ వృత్తి కి సంబందించిన ఆటు పోట్లు కష్టాల గురించి గుర్తు చేస్తూ వైద్యులు ఈర్ష్య ద్వేషాలకు దూరంగా ఉంటే సమస్యలు వచ్చినపుడు సంఘటితంగా పరిష్కరించు కోవచ్చని అన్నారు. ఐ ఏం ఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. ద్వారాకానాథ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యుల చేత పదవీ ప్రమాణ స్వీకార ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఐఎంఏ జనగామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన డా. జె. బాలాజీ మాట్లాడుతూ1993 లో చార్టర్ అధ్యక్షునిగా డా. ఎస్. రాంనర్సయ్య, చార్టర్ కార్యదర్శిగా డా. డి. లవకుమార్ రెడ్డి నేతృత్వంలో ప్రారంభం చేసిన జనగామ శాఖ సాధించిన మైలు రాళ్లలో ప్రధానంగా రాష్ట్ర మహాసభ జనగామలో నిర్వహించి జాతీయ స్థాయిలో ఉత్తమ బ్రాంచి అవార్డు సాధించిన ప్రగతికి తగ్గట్టుగా తాను కూడా తన కార్యవర్గం తో కలిసి పని చేసి సంస్థ ప్రతిష్ట ను కాపాడుతామని అన్నారు. సమావేశంలో విశిష్టఅతిథి గా పాల్గొన్న జనగామ శాసన సభ్యుడు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన, పని పరంగా సంతృప్తి ని ఇచ్చే వైద్య రంగంలో చేరిన డాక్టర్లను అభినందించారు. ఏ వృత్తి లో నైనా సమస్యలు రావడం సహజం కానీ వైద్యుల పట్ల అనాలోచితంగా అవగాహన లోపంతో నిందలు వేయడం సరికాదు అన్నారు. చేర్యాల మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ వైద్యుడు ప్రత్యక్ష దైవం అని అన్నారు. విద్యావిధాన లోపం వల్ల అవగాహన కొరవడి వైద్యుల పై దాడులు జరిపే దుర్నీతి నివారణ కు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎం ఏ పూర్వ అధ్యక్షుడు డా. డి. లవకుమార్ రెడ్డి , సీనియర్ డా. జె. వెంకటేశ్వర్లు , రాష్ట్ర కోశాధికారి డా. దయాల్ సింగ్, జిల్లా వైద్యాధికారి డా మల్లికార్జున్ రావు, తక్షణ పూర్వ అధ్యక్షుడు డా. ఏ. శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ శివరాజ్ యాదవ్, తక్షణ పూర్వ మున్సిపల్ ఛైర్మన్ పోకల జమున లింగయ్య, సీనియర్ డాక్టర్లు డా. సిహెచ్ రాజమౌళి, ఎల్. లక్ష్మి నారాయణ నాయక్, డా. పి. సుగుణకర్ రాజు, డా. రవీందర్ గౌడ్, డా. జి. గోపాల్ రెడ్డి, డా. కల్నల్ బిక్షపతి, డా. ఎం. ఇన్నారెడ్డి, డా. స్వప్న లింగమూర్తి, డా. విజయలక్ష్మి, డా. ప్రీతీ దయాల్, డా. ఎల్. అశోక్, లయన్స్ ఇంటరనేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు తదితర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఇందులో డా. స్వప్న రాథోడ్, డా. రంజిత్ కుమార్, డా. విజ్ఞశ్రీ, కార్యదర్శి డా. ఏ. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు ఎడ్ల బండ్లతో సిద్ధమవుతున్న సూర్యాపేట రైతులు..

**రజతోత్సవ సభకు మేముసైతం అంటున్న రైతన్నలు..**

**సూర్యాపేట నుండి తరలివెళ్లేందుకు ముస్తాబవుతున్న ఎడ్లబండ్లు..**



**జనతా న్యూస్:** కెసిఆర్ మాటలు వినాలని.. కొండంత అభిమానంతో మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సారథ్యంలో స్వచ్ఛందంగా వెళతామంటున్న రైతులు.. కెసిఆర్ సారును కలవాలి.. మా గోడు వెళ్ళబుచ్చుకోవాలి.. గత పదేండ్లు %దీ=వా% పాలనలో ఆనందంగా వున్నాం.. అన్నిరంగాలతో పాటు రైతంగాన్ని కెసిఆర్ కంటికి రెప్పలా కాపాడుకున్నడు.. మా జగదీష్ రెడ్డి కాళేశ్వరం నీళ్లతో ఎండిన చెరువులు నింపి సూర్యాపేటను సస్యశ్యామలం చేసిండు.. మండువేసవిలో ఎండిన చెరువులు అలుగులు పోసినయి.. పంటలు బాగా పండినాయి.. అప్పులు తీర్చుకున్నాం.. నాలుగు పైసలు చేతుల పట్టుకున్నాం.. గత పదేండ్లు కెసిఆర్ పాలనలో వలసలు ఆగి.. ఇతర రాష్టాలనుంచే ఇక్కడికే వలసలు వచ్చే పరిస్థితి వుండే.. ఇప్పుడు నీళ్లులేక పంటలు సరిగా పండక మళ్ళీ రైతులు కూలి పనుల కోసం వలసపోయే పరిస్థితి వచ్చింది.. కాంగ్రెస్, రేవంత్ మాయమాటలకు మోసపోయి గోసపడుతున్నాం.. ఈ కాంగ్రెస్ వచ్చినాకనించి ఏడాదిన్నర పాలనలోనే ఇంత కరువు వచ్చింది.. నీళ్లులేక పొలాలు ఎండిపోయినయి.. చేతికొచ్చిన కాస్త పంటకు మద్దతు దరలేకుండా పోయింది.. అప్పులెట్ల తీర్చాలే.. పెట్టుబడెట్ల ఎల్లాలే.. ఇల్లేట్ల గడవాలే.. చెరువులు కుంటలు ఎండినయి.. సాగుతో పాటు తాగునీరు కష్టమైంది.. అని ఆవేదన వెళ్ళబుచ్చుతున్న రైతులు.. అందుకే మాకు మళ్ల కెసిఆర్ పాలనే కావాలె.. అంటూ సూర్యాపేట రైతులు దీమాగా చెబుతున్నారు.. BRS 25 ఏండ్ల పండుగకు వారం రోజుల ముందుగానే బయలుదేరతామంటున్నారు.. సభ ప్రారంభం నాటికీ చేరుకునేలా ముందస్తుగా సిద్ధమవుతున్నామంటుండ్రు.. బండెనక బండి కట్టి అన్న పాటను తలపించేలా సూర్యాపేట రైతులు ఎడ్ల బండ్లను ముస్తబుచేస్తూన్నరు.. ఈ నెల 22 న సూర్యాపేట నియోజకవర్గం ఆత్మకూర్ (ఎస్) మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ తల్లికి మొక్కి బయలుదేరుతామంటున్నారు..



# ఎండల మంట వానల తంటా

**రాష్ట్రంలో ఆదివారం కొనసాగిన విచిత్ర వాతావరణం**
**ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో మండిన సూరీడు**
**నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో రైతులను దెబ్బతీసిన అకాల వర్షం**
**వనపర్తిలో పిడుగుపాటుకు 25 గొర్రెల మృతి**
**ములుగు జిల్లాలో వడదెబ్బకు ఒకరి మృతి**
**నేడు వర్షాలు, రేపట్నించి తీవ్రం కానున్న ఎండలు**



రాష్ట్రంలో కొద్ది రోజులుగా విచిత్ర వాతావరణం ఉంటుంది. తెల్లవారుజాము నుంచే చాలా చోట్ల సూర్యుడు ప్రతాపం చూపుతుండగా.. పలు చోట్ల ఒక్కసారిగా వాతావరణం మారిపోయి అకాల వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఆదివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో ఎండలు దంచికొట్టగా..నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాల్లో అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత నిజామాబాద్‌లో 43.1, మెదక్‌లో 41.8, రామగుండంలో 41.4, నల్లగొండ, హన్మకొండ, మహబూబ్‌నగర్‌లలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోపక్క, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి బిజినేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. తాడూరు మండలంలో మొక్కజొన్న, పెసర్లు, వరి పంటలు నేలకొరిగాయి. తెలకపల్లి మార్కెట్‌యార్డులో రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్న, వడ్లు తడిచిపోయాయి.

జిల్లాలో చాలా చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. వనపర్తి జిల్లాలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పెద్దమందడి, కొత్తకోట, గోపాల్‌పేట, రేవల్లి, వనపర్తి మండలాల్లో చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడిచిపోయింది. గోపాల్‌పేట మండలంలోని చాకల్‌పల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల సమీపంలో పిడుగుపడి రాములు, విశ్వనాథం అనే గొర్రెల కాపరులు గాయపడగా, 25 గొర్రెలు మృతి చెందాయి. జోగుళాంబ గద్వాల జిల్లాఆలంపూర్, ఉండవెల్లి, మానవపాడు మండలాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. అయిజ మండలంలో వరి పైర్లు దెబ్బతిన్నాయి. మల్దకల్ మండలంలో పిడుగుపాటు వల్ల ఎద్దులు మరణించాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆదివారం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు అక్కడక్కడ కురిశాయి. పిడుగుపాటుకు ఓ ఆవు మరణించగా, యాచారం మండలంలో పంటలు దెబ్బతిన్నాయి.

**వడదెబ్బతో వలస కూలీ మృతి**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం సమీపంలో.. పూనెం సన్ను(32) అనే వలస కూలీ వడదెబ్బకు గురై మరణించాడు. ఛత్తీస్‌గఢ్ కు చెందిన సన్ను స్థానిక మిర్చితోటలో పని చేయడానికి వచ్చాడని, పని ప్రాంతంలో వడదెబ్బకు గురై అక్కడికక్కడే మరణించాడని పోలీసులు వెల్లడించారు.

**నేడు వర్షాలు, రేపట్నించి మంటలు**

రాష్ట్రంలో పలుచోట్ల సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగం కలిగిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇక, మంగళవారం నుంచి రాష్ట్రంలో ఎండలు మరింత పెరగనున్నాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది. 44-45 డిగ్రీల దాకా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొంది.

## చమురు దిగుమతులు జూమ్..

**2024-25లో రూ.13.76 లక్షల కోట్లు**

న్యూఢిల్లీ: మన దేశ చమురు దిగుమతులు ఏటికేటికి పెరిగి పోతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత్.. విదేశాల నుంచి 24.24 కోట్ల టన్నుల ముడి చమురు దిగుమతి చేసుకుంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే ఇది 4.2 శాతం ఎక్కువ. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన మొత్తం చమురు అవసరాల్లో 89.1 శాతం దిగుమతుల ద్వారానే భర్తీ అయింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది అర శాతం ఎక్కువ. ఇదే సమయంలో దేశీయ చమురు ఉత్పతి మాత్రం 2.94 కోట్ల టన్నుల నుంచి 2.87 కోట్ల టన్నులకు పడిపోయింది.

పెరిగిన భారం: 2024-25 ఆర్థిక సంవత్సరంలో చమురు, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి బిల్లు 15,630 కోట్ల డాలర్ల నుంచి 16,100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.13.76 లక్షల కోట్లు) చేరింది. ఇదే సమయంలో గ్యాస్ దిగుమతులూ 15.4 శాతం పెరిగి 3,669.9 కోట్ల ప్రామాణిక ఘనపు మీటర్ల (ఎంఎంఎస్‌సీఎం)కు చేరాయి. కాగా దేశీయ గ్యాస్ ఉత్పత్తి 3,611.3 ఎంఎంఎస్‌సీఎంకు పడిపోయింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 0.9 శాతం తక్కువ. ఇంధన స్టోరేజీలోకి రూ.4.79 లక్షల కోట్ల పెట్టుబడులు: మన దేశ ఇంధన స్టోరేజీ రంగం 2032 నాటికి భారీగా పెట్టుబడులను ఆకర్షించనుంది. ఇది ఎంత లేదన్నా రూ.4.79 లక్షల కోట్ల వరకు ఉంటుందని ఇండియా ఎనర్జీ స్టోరేజీ అలయెన్స్ (ఐఈఎస్ఏ) అంచనా. 2026-32 మధ్య కాలంలో ఈ రంగం ఐదింతలు పెరగనుంది. టెక్నాలజీ నవకల్పనలతో గత రెండున్నర సంవత్సరాల్లో నెలకు ఒక మెగావాట్ ఇంధన స్టోరేజీ ఖర్చులు రూ.10 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు తగ్గినట్టు ఐఈఎస్ఏ తెలిపింది.

## పిల్లలకు ఇవి నేర్పించాలి..



పిల్లలు బడిలో చదువుతున్నప్పుడే... తల్లిదండ్రులు వాళ్లకి చిన్న చిన్న ఇంటిపనులు చేయడం నేర్పించాలి. దీనివల్ల పిల్లలకు బాధ్యత, సహాయం చేయడం, ఆత్మవిశ్వాసం, విచక్షణా జ్ఞానం, సంఘటిత శక్తి విలువ అవగతమవుతాయి. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దాన్ని పరిష్కరించుకునే సామర్థ్యం అలవడుతుంది.

**పిల్లలకు చిన్నతనంలోనే నేర్పించాల్సిన పనులు ఇవే...**

కూరగాయలు కడగడం-కోయడం, మసాలా దినుసుల వివరాలు- వాటి వినియోగం, వంటగది గట్టు తుడవడం, భోజనం వడ్డించడం, పాత్రలు కడగడం లాంటి పనులను పిల్లలకు చెప్పి చేయించాలి.

నిద్ర లేవగానే దుప్పట్లు మడతపెట్టడం, పరుపు సర్దడం, ఉతికిన బట్టలు ఆరవేయడం-మడతపెట్టడం, బీరువాలో బట్టలు సర్దడం నేర్పించాలి.

లైట్లు, ఫ్యాన్లు, టీవీ, సోఫా, అద్దం, ఇంట్లోని అలంకరణ వస్తువులను దుమ్ము లేకుండా తుడవడం నేర్పించాలి.

ఇల్లు ఊడవడం, వ్యాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించడం, చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వడం లాంటివి నేర్పించాలి.

న్యూస్ పేపర్లు, పుస్తకాలను అరల్లో సర్దడం చూపించాలి.


ఇంటికి కావాల్సిన కిరాణా సరుకుల లిస్ట్ రాయడం, బజారు నుంచి కూరగాయలు తీసుకురావడం లాంటివి నేర్పించాలి. ధరలు-నాణ్యతలపై అవగాహన కల్పించాలి

ఇంటికి వచ్చిన అతిథులను పలుకరించడం, ఆదరించడం, గౌరవించడం నేర్పించాలి.

టూత్‌బ్రష్‌లు, టూత్‌పేస్టు, షాంపూ, సబ్బులు తదితరాలను వినియోగించుకున్న తరవాత వాటిని యథాస్థానంలో ఉంచడం అలవాటు చేయాలి.

ఇంట్లో బూజులు దులపడం, మొక్కలకు నీళ్లు పోయడం, పరిసరాల్లో చెత్తచెదారం లేకుండా శుభ్రం చేయడం లాంటి పనులు నేర్పించాలి.

## అందమైన చర్మం కోసం పానీయాలు..



సరైన పోషకాలు అందినప్పుడే చర్మం అందంగా కనిపిస్తుంది. ఈ వేసవిలో ఆరోగ్యకరమైన పానీయాలు సేవించి చక్కని చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు. చర్మాన్ని మెరిపించే పానీయాలు ఇవే... ఎండాకాలంలో తేనె కలిపిన గ్రీన్ టీ తాగడం మంచిది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని టాక్సిన్లను బయటికి పంపుతాయి. దీంతో చర్మం మృదువుగా మారుతుంది.

ఒక గ్లాసు నీటిలో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా అల్లం రసం కలుపుకుని తాగితే చర్మానికి కొత్త కాంతి లభిస్తుంది.

ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా కలబంద జ్యూస్ కలుపుకుని తాగితే చర్మం తేమగా ఉంటుంది. ఎండ వల్ల కమిలిన చర్మం యథాస్థితికి వస్తుంది. ముఖం మీద మొటిమలు రావు.

ఒక గ్లాసు వేడి నీళ్లలో చిటికెడు పసుపు వేసుకుని తాగితే చర్మం బిగుతుగా మారుతుంది. పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మ సమస్యలను నిరోధిస్తాయి.

వేసవికాలంలో వారానికి రెండుసార్లు నారింజ రసం తాగుతూ ఉంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం మీద ముడతలు మాయమవుతాయి.

ప్రతిరోజూ క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల ఎ, కె, సి విటమిన్లు అంది చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

పుచ్చకాయలో ఎక్కువగా నీరు ఉంటుంది. కొద్దిగా ఫైబర్, గ్లూకోజ్ తదితరాలు కూడా ఉంటాయి. తరచూ పుచ్చకాయ రసం తాగుతూ ఉంటే చర్మం ఛాయగా ఉంటుంది.

ప్రతిరోజూ కీర దోస జ్యూస్ తాగితే...చర్మం పొడిబారకుండా ఉంటుంది.





## అల్లంతో కొలెస్ట్రాల్‌కు చెక్



శరీరంలో చెడు కొలెస్ట్రాల్ చేరడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రక్తప్రసరణ వ్యవస్థ మందగిస్తుంది. దీంతో శరీర భాగాలకు రక్తాన్ని పంపడం కోసం గుండె ఎక్కువగా కష్టపడాల్సి వస్తుంది. క్రమంగా గుండె బలహీనమవుతుంది. ఇలాంటి పరిస్థితులకు కారణమైన చెడు కొలెస్ట్రాల్‌ను నివారించడానికి అల్లం ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అల్లాన్ని ఎలా వాడాలో తెలుసుకుందాం...

అల్లాన్ని శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కోసి మెత్తని పేస్టులా చేయాలి. ఒక గిన్నెలో ఒక గ్లాసు నీళ్లు పోసి అందులో ఒక చెంచా అల్లం పేస్టు వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఈ నీటిని బాగా మరిగించి గ్లాసులో పోసుకుని మెల్లగా తాగాలి. ఇలా వారానికి రెండుసార్లు తాగుతూ ఉంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు నీళ్లు పోసి అయిదు అల్లం ముక్కలు వేసి బాగా ఉడికించాలి. తరవాత ఈ నీళ్లను గ్లాసులోకి వడబోసి అందులో మూడు చెంచాల నిమ్మరసం కలుపుకొని తాగాలి. వారానికి ఒకసారి ఇలా తాగితే గుండె సిరల్లో పేరుకున్న కొలెస్ట్రాల్ కరిగిపోతుంది.

ఒక అంగుళం పొడవున్న అల్లం ముక్కను సన్నగా తురమాలి. ఈ అల్లం తురుములో ఒక చెంచా బెల్లం పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తింటే శరీర భాగాల్లో పేరుకున్న చెడు కొలెస్ట్రాల్ తొలగిపోతుంది. బెల్లానికి బదులు తేనె కూడా కలుపుకోవచ్చు.

అల్లాన్ని చిన్న ముక్కలుగా కోసి కొద్దిగా ఆరబెట్టాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రెండు అల్లం ముక్కలను నోట్లో వేసుకుని నములుతూ రసాన్ని మెల్లగా మింగాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకోదు. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.

ఉదయాన్నే టీ పెట్టుకునేటప్పుడు అందులో చిన్న అల్లం ముక్కను కచ్చాపచ్చాగా దంచి వేయాలి. ఈ అల్లం టీ తాగడం వల్ల కూడా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఏర్పడదు. ఒక గ్లాసు మజ్జిగలో కొద్దిగా అల్లం తురుము కలుపుకుని తాగినా మంచి ఫలితం ఉంటుంది.

## బరువు ఎప్పుడు చూసుకోవాలి..

మనం సరిగ్గా ఎంత బరువున్నామో తెలియాలంటే విధిగా కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం...


ఉదయం పూట నిద్ర లేవగానే ఖాళీ కడుపుతో బరువును పరీక్షించుకోవాలి. అప్పుడే సరైన బరువు తెలుస్తుంది. వారానికి ఒకసారి బరువును పరీక్షించుకోవడం మంచిది. ప్రతిరోజూ శరీరంలో నీటి శాతం, ఆహారం తీసుకునే విధానం మారుతూ ఉంటాయి. వీటివల్ల బరువులో హెచ్చు తగ్గులు కనిపించవచ్చు. కాబట్టి ప్రతిరోజూ బరువు చూసుకోకూడదు.ప్రతీ వారం.... ఒకే రోజున ఒకే సమయానికి ఒకే దుస్తులు ధరించి పరీక్షించుకుంటే కచ్చితమైన బరువు తెలుస్తుంది.

నెలసరి సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా శరీరంలో నీరు నిలుస్తుంది. కడుపు ఉబ్బరంగా కూడా అనిపిస్తూ ఉంటుంది. ఈ సమయంలో బరువు చూసుకోకూడదు.

మలబద్ధకం ఉన్న సమయంలో కూడా బరువు చూడకూడదు. తరచూ నీళ్లు తాగుతూ పీచుపదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటూ సమస్య తీరిన తరవాత మాత్రమే బరువు చూసుకోవాలి.

రాత్రి పూట పడుకునేముందు బరువు చూడకూడదు.

భోజనం చేసిన వెంటనే బరువు పరీక్షించుకోకూడదు. తిన్న తరవాత కనీసం పన్నెండు నుంచి ఇరవై గంటలు ఆగిన తరవాతే బరువు చూసుకోవాలి.



# ముంబై హ్యాట్రిక్ విజయం



## ఫామ్ చాటుకున్న రోహిత్
## చెలరేగిన సూర్యకుమార్
## చెన్నై ఖాతాలో ఆరో ఓటమి



ముంబై: సొంతగడ్డపై ముంబై ఇండియన్స్ మరోసారి అదరగొట్టింది. ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న ఓపెనర్ రోహిత్ శర్మ (45 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 76 నాటౌట్) ఎట్టకేలకు సత్తా చాటుకున్నాడు. అలాగే పసలేని చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్‌ను సూర్యకుమార్ (30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 నాటౌట్) కూడా చెడుగుడు ఆడడంతో.. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో హార్దిక్ సేన 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆరంభ ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క గెలుపే దక్కించుకున్న ముంబైకి హ్యాట్రిక్ విజయం దక్కడం విశేషం. అలాగే సీఎసకేపై వరుసగా నాలుగు ఓటముల తర్వాత ముంబై గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 176 పరుగులు సాధించింది. జడేజా (35 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 53 నాటౌట్), దూబే (32 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 50) అర్ధసెంచరీలు సాధించగా, 17 ఏళ్ల ఆయుష్ (15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32) అరంగేట్రంలో ఆకట్టుకున్నాడు. బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 15.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 177 పరుగులు చేసి నెగ్గింది. జడేజాకు ఓ వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రోహిత్ నిలిచాడు.

**అజేయ శతక భాగస్వామ్యంతో:**

ఓ మాదిరి ఛేదనలో ముంబై జోరు ఎక్కడా తగ్గలేదు. మంచు ప్రభావం కూడా ఉండడంతో వేగంగా పరుగులు వచ్చాయి. గత ఆరు మ్యాచ్‌ల్లో కేవలం 82 రన్స్ మాత్రమే చేసిన ఓపెనర్ రోహిత్ చెన్నై పేలవ బౌలింగ్‌పై ఫామ్ అందుకున్నాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడగా జట్టు పది పరుగుల రన్‌రేట్‌తో సాగింది. మూడో ఓవర్‌లో 6,4,4తో తను 14 రన్స్ అందించాడు. మరో ఓపెనర్ రికెల్టన్ (24) కూడా ధాటిని కనబర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 56 పరుగులు సాధించింది. అయితే తొలి వికెట్‌కు 63 పరుగులు జత చేరాక రికెల్టన్‌ను జడేజా అవుట్ చేశాడు. చెన్నైకి దక్కింది ఈ ఒక్క వికెట్టే. ఆ తర్వాత రోహిత్‌కు సూర్య అండగా నిలవడంతో సీఎసకే బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. 33 బంతుల్లో రోహిత్ ఈ సీజన్‌లో తొలి హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఇక స్పిన్నర్లు జడేజా, నూర్ అహ్మద్‌లను లక్ష్యం చేసుకున్న సూర్య బౌండరీలతో చెలరేగాడు. నూర్ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగిన అతడు.. నూర్ తర్వాతి ఓవర్‌లోనూ 4,6తో భారీగా పరుగులు రాబట్టాడు. ఈ ధాటికి 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేశాడు. మరోవైపు 30 బంతుల్లో 20 రన్స్ కావాల్సిన వేళ, 16వ ఓవర్‌లోనే మూడు సిక్సర్లతో సూర్య మ్యాచ్‌ను ముగించాడు. రెండో వికెట్‌కు ఈ జోడీ అజేయంగా 114 రన్స్ అందించింది.


**ఆదుకున్న జడేజా-దూబే:**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఇన్నింగ్స్ నిదానంగా ఆరంభమైంది. ముంబై పేసర్లు చక్కటి లైన్ అండ్ లెంగ్త్ బంతులకు తోడు ఫీల్డింగ్ కూడా అద్భుతంగా ఉండడంతో సీఎసకేకు పరుగులు రావడమే కష్టమై పోయింది. ఓపెనర్లు రచిన్ (5), రషీద్ (19) సింగిల్స్‌కే పరిమితమయ్యారు. తొలి మూడు ఓవర్లలో 16 పరుగులే రాగా.. ఇందులో పది డాట్ బాల్స్ ఉండడం గమనార్హం. చివరకు 18వ బంతికి చెన్నై తొలి ఫోర్ కొట్టగలిగింది. ఇక నాలుగో ఓవర్ తొలి బంతికే రచిన్‌ను పేసర్ అశ్వని అవుట్ చేశాడు. అయితే నిస్సారంగా సాగుతున్న వీరి ఇన్నింగ్స్‌కు 17 ఏళ్ల ఆయుష్ మాత్రే ఊపు తెచ్చాడు. తొలి ఐపీఎల్ అయినా 'సొంత వేదిక'పై చెలరేగాడు. నాలుగో ఓవర్‌లోనే 4,6,6తో 18 రన్స్ రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 48/1 స్కోరుతో నిలువగలిగింది. కానీ ఏడో ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాక మాత్రేను పేసర్ చాహర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే రషీద్ స్టంప్ అయ్యాడు. ఇక ఆ తర్వాత జడేజా-దూబే పూర్తి రక్షణాత్మకంగా ఆడడంతో 8–11 ఓవర్ల మధ్య ఒక్క ఫోర్ కూడా రాకపోగా కేవలం 14 పరుగులే సమకూరాయి. ఆ తర్వాత దూబే బ్యాట్ ఝుళిపించడంతో చెన్నై కాస్త కోలుకుంది. హార్దిక్ ఓవర్‌లో సిక్సర్‌తో పాటు బౌల్ట్ ఓవర్‌లో 4,6తో జట్టు స్కోరును వంద దాటించాడు. ఇక 16వ ఓవర్‌లో జడేజా 4,6 దూబే 6,6తో 24 పరుగులు రాగా... అటు దూబే 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అయితే 17వ ఓవర్‌లో బుమ్రా మూడు పరుగులే ఇచ్చి ఓ స్లో డెలివరీతో దూబేకు ఝలకిచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 79 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ధోనీ (4) నిరాశపర్చగా.. ఆఖరి ఓవర్‌లో జడేజా 6,4తో 16 రన్స్ రాబట్టి స్కోరును 170 దాటించాడు. అలాగే తను 34 బంతుల్లో అజేయ అర్ధసెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు.

**స్కోరుబోర్డు**

చెన్నై: రషీద్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) శాంట్నర్ 19, రచిన్ (సి) రికెల్టన్ (బి) అశ్వని కుమార్ 5, ఆయుష్ మాత్రె (సి) శాంట్నర్ (బి) చాహర్ 32, జడేజా (నాటౌట్) 53, శివమ్ దూబే (సి) జాక్స్ (బి) బుమ్రా 50, ధోనీ (సి) తిలక్ (బి) బుమ్రా 4, ఓవర్టన్ (నాటౌట్) 4, ఎక్స్‌ట్రాలు: 9బీ మొత్తం: 20 ఓవర్లలో 176/5బీ వికెట్ల పతనం: 1–16, 2–57, 3–63, 4–142, 5–156బీ బౌలింగ్: దీపక్ చాహర్ 4–0–32–1, బౌల్ట్ 4–0–43–0, అశ్వని కుమార్ 2–0–42–1, శాంట్నర్ 3–0–14–1, బుమ్రా 4–0–25–2, విల్ జాక్స్ 1–0–4–0, హార్దిక్ 2–0–13–0.

ముంబై: రికెల్టన్ (సి) మాత్రె (బి) జడేజా 24, రోహిత్ (నాటౌట్) 76, సూర్యకుమార్ (నాటౌట్) 68, ఎక్స్‌ట్రాలు: 9బీ మొత్తం: 15.4 ఓవర్లలో 177/1బీ వికెట్ పతనం: 1–63బీ బౌలింగ్: ఖలీల్ 2–0–24–0, ఓవర్టన్ 2–0–29–0, అశ్విన్ 4–0–25–0, జడేజా 3–0–28–1, నూర్ 3–0–36–0, పతిరన 1.4–0–34–0.



## అమోఘం.. అతని అరంగేట్రం!

న్యూఢిల్లీ: 14 ఏళ్లకే ఐపీఎల్ అరంగేట్రం.. ఎవరూ కలలో కూడా ఊహించని నిజం. బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ ఈస్థాయికి ఎదుగుతాడని అతడి తండ్రి సంజీవ్ తప్ప ఎవరూ ఊహించలేదు. గొప్ప కోచింగ్ అకాడమీల్లో ప్రాక్టీస్ చేయలేక పోయినా.. ఖరీదైన కిట్‌లు, బ్యాట్లు లేకపోయినా ఆటపై ఉన్న ప్రేమతోనే అతడు అందరి దృష్టినీ ఆకర్షించాడు. తొలి గురువైన తండ్రి శిక్షణలోనే రాటుదేలాడు. 12 ఏళ్లకే రంజీల్లోకి అడుగుపెట్టి ప్రకంపనలు సృష్టించిన వైభవ్.. 13 ఏళ్లకే టీ20లు ఆడాడు. గతేడాది ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడిని రూ. కోటికి కొనుగోలు చేసినప్పుడే వైభవ్ సత్తా ఏంటో తెలిసింది. ఇక, శనివారం లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్.. ఎదుర్కొన్న తొలిబంతినే సిక్స్‌గా మలచడం మేటి క్రికెటర్లను కూడా అబ్బుర పరచింది. ఆ మ్యాచ్‌లో 20 బంతులు ఆడిన వైభవ్.. 34 పరుగులు చేశాడు. అతడి టెక్నిక్ మరింత పదును తేలాల్సి ఉన్నా.. తనకంటే ఎక్కువ వయసు, అనుభవం ఉన్న బౌలర్లను బెరుకులేకుండా ఎదుర్కొన్న తీరు అందరితో ఔరా అనిపించింది. ఇక, వైభవ్ బ్యాట్ స్వింగ్ చేస్తున్న తీరు యువరాజ్‌ను గుర్తు చేస్తోందని ఇంగ్లండ్ క్రికెటర్ సామ్ బిల్లింగ్స్ ప్రశంసించాడు.

# బెంగళూరు.. ప్రతీకారం

## కోహ్లీ, పడిక్కల్ అర్ధ శతకాలు
## 7 వికెట్లతో పంజాబ్ చిత్తు



ముల్లన్‌పూర్: విరాట్ కోహ్లీ (54 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 73 నాటౌట్), దేవ్‌దత్ పడిక్కల్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) అదరగొట్టడంతో.. పంజాబ్ కింగ్స్‌పై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ప్రతీకారం తీర్చుకొంది. శుక్రవారం సొంతగడ్డపై అయ్యర్ సేన చేతిలో చిత్తయిన బెంగళూరు.. 48 గంటలు తిరక్కుండానే లెక్కసరి చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 7 వికెట్లతో పంజాబ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 157/6 స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (33), శశాంక్ సింగ్ (31 నాటౌట్), జోష్ ఇంగ్లిస్ (29), మార్కో జెన్సన్ (25 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. క్రునాల్ పాండ్యా, సుయాష్ శర్మ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బెంగళూరు 18.5 ఓవర్లలో 3 వికెట్లకు 159 రన్స్ చేసి గెలిచింది. కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

**కష్టపడకుండా కొట్టేశారు:**

బెంగళూరు ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ సాల్ట్ (1)ను అవుట్ చేసిన అర్ష్‌దీప్ షాకిచ్చాడు. కానీ, మరో ఓపెనర్ విరాట్ కోహ్లీ సహకారంతో దేవ్‌దత్ పడిక్కల్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 69 బంతుల్లో 103 రన్స్ జోడించడంతో.. మ్యాచ్ బెంగళూరువైపు మొగ్గింది. బౌండ్రీతో ఖాతా తెరిచిన పడిక్కల్.. ఆ తర్వాత చెలరేగాడు. మరోవైపు వీలుచిక్కినప్పుడల్లా కోహ్లీ షాట్లు ఆడడంతో 6 ఓవర్లకు బెంగళూరు 54/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగుల వేగం మందగించింది. కానీ, సింగిల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న పడిక్కల్.. 12వ ఓవర్‌లో స్టొయినిస్ బౌలింగ్‌లో 6,4తో బ్యాట్ ఝుళిపించడంతో జట్టు స్కోరు సెంచరీ దాటింది. అయితే, ఎదురుదాడి చేసే ప్రయత్నం చేస్తున్న పడిక్కల్‌ను హర్‌ప్రీత్ క్యాచవుట్ చేశాడు. అనంతరం విరాట్, కెప్టెన్ రజత్ పటీదార్ (12) మూడో వికెట్‌కు 34 రన్స్ చేర్చడంతో.. ఆర్‌సీబీ గెలుపునకు మరింత చేరువైంది. పటీదార్‌ను చాహల్ పెవిలియన్ చేర్చినా.. కోహ్లీ, జితేశ్ (11 నాటౌట్) 7 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

**బ్యాటర్ల తడబాటు:**

మందకొడి పిచ్‌పై క్రునాల్, సుయాష్ తిప్పేయడంతో.. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన పంజాబ్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (22), ప్రభ్‌సిమ్రన్ 4.2 ఓవర్లలో 42 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యంతో దూకుడైన ఆరంభాన్నిచ్చారు. యశ్ వేసిన రెండో ఓవర్‌లో ఆర్య 6,4 బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో భువీ బౌలింగ్‌లో ప్రభ్‌సిమ్రన్ 3 ఫోర్లు కొట్టాడు. అయితే, ఐదో ఓవర్‌లో వ్యూహాత్మకంగా క్రునాల్‌కు బంతిని ఇవ్వడం బెంగళూరుకు లాభించింది. భారీ షాట్లు ఆడే జోరు మీదున్న ప్రియాన్ష్‌ను క్రునాల్ బోల్తా కొట్టించాడు. కానీ, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (6)తో కలసి ప్రభ్‌సిమ్రన్ స్కోరు బోర్డును నడిపించాడు. హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో ప్రభ్‌సిమ్రన్ సిక్స్ బాదగా.. అయ్యర్ బౌండ్రీ కొట్టాడు. దీంతో పవర్‌ప్లేను పంజాబ్ 62/1తో మెరుగ్గానే ముగించింది. కానీ, తర్వాతి ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్‌ను కూడా క్రునాల్ పెవిలియన్ చేర్చా డు. దీంతో.. పంజాబ్ 68/3తో ఒక్కసారిగా తడబడింది. ఇంగ్లిస్‌తో సమన్వయ లోపం కారణంగా నేహల్ వధేరా (5) రనౌటయ్యాడు. ఆ దశలో ఇంగ్లిస్, శశాంక్ ఐదో వికెట్‌కు 36 రన్స్ భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, 14వ ఓవర్‌లో ఇంగ్లిస్, స్టొయినిస్ (1)ను సుయాష్ బౌల్డ్ చేశాడు. ఇక, డెత్ ఓవర్లలో భువీ, హాజెల్‌వుడ్ కట్టుదిట్టంగా బంతులేయడంతో.. శశాంక్, జెన్సన్ భారీ షాట్లు ఆడలేకపోయారు. వీరిద్దరూ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ ఏడో వికెట్‌కు అజేయంగా 43 రన్స్ జోడించడంతో.. స్కోరు కష్టంగా 150 దాటింది. ఆఖరి బంతికి జెన్సన్ సిక్స్‌తో ఇన్నింగ్స్‌ను ముగించగా.. చివరి 5 ఓవర్లలో పంజాబ్ 38 పరుగులే చేయగలిగింది.

**స్కోరుబోర్డు**

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య (సి) డేవిడ్ (బి) క్రునాల్ 22, ప్రభ్‌సిమ్రన్ (సి) డేవిడ్ (బి) క్రునాల్ 33, శ్రేయాస్ (సి) క్రునాల్ (బి) షెపర్డ్ 6, ఇంగ్లిస్ (సి) సుయాష్ 29, నేహల్ (రనౌట్) 5, శశాంక్ (నాటౌట్) 31, స్టొయినిస్ (బి) సుయాష్ 1, జెన్సన్ (నాటౌట్) 25బీ ఎక్స్‌ట్రాలు: 5బీ మొత్తం: 20 ఓవర్లలో 157/6బీ వికెట్ల పతనం: 1–42, 2–62, 3–68, 4–76, 5–112, 6–114బీ బౌలింగ్: భువనేశ్వర్ 4–0–26–0, యశ్ దయాళ్ 2–0–22–0, హాజెల్‌వుడ్ 4–0–39–0, క్రునాల్ 4–0–25–2, షెపర్డ్ 2–0–18–1, సుయాష్ 4–0–26–2.

బెంగళూరు: సాల్ట్ (సి) ఇంగ్లిస్ (బి) అర్ష్‌దీప్ 1, కోహ్లీ (నాటౌట్) 73, పడిక్కల్ (సి) వధేరా (బి) హర్‌ప్రీత్ 61, రజత్ (సి) జెన్సన్ (బి) చాహల్ 12, జితేశ్ (నాటౌట్) 11బీ ఎక్స్‌ట్రాలు: 1బీ మొత్తం: 18.5 ఓవర్లలో 159/3బీ వికెట్ల పతనం: 1–6, 2–109, 3–143బీ బౌలింగ్: అర్ష్‌దీప్ 3–0–26–1, బ్రాట్‌లెట్ 3–0–28–0, హర్‌ప్రీత్ 4–0–27–1, జెన్సన్ 3–0–20–0, చాహల్ 4–0–36–1, స్టొయినిస్ 1–0–13–0, నేహల్ వధేరా 0.5–0–9–0.



## అతని ప్రవర్తనతో చాలా భయపడ్డా!


ప్రతీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొన్ని నియమాలుంటాయని, అవి అన్ని చోట్లా ఒకేలా ఉండవని ప్రముఖ నటి మాళవికా మోహనన్ తెలిపింది. సౌత్ లో కనిపించాలంటే హీరోయిన్ మరీ సన్నగా ఉండకూడదని, అలా ఉంటే తప్పని శరీరాకృతి విషయంలో తాను ఎన్నో ఛాలెంజెస్ ఎదుర్కొన్నట్టు మాళవికా తెలిపింది. ఒకప్పుడు తనపై ఎన్నో విమర్శలు వచ్చాయని మాళవిక వెల్లడించింది. గతంలో తనపై వచ్చిన విమర్శలు తనను ఎంతగానో బాధించాయని చెప్తూ తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని మాళవిక బయటపెట్టింది. ఒకరోజు రాత్రి తాను ఫ్రెండ్స్ తో కలిసి ముంబైలోని లోకల్ ట్రైన్ లో జర్నీ చేశానని, ఆ జర్నీ టైమ్ లో తనని ఒకతని ప్రవర్తన చాలా భయపెట్టిందని మాళవికా మోహనన్ తెలిపింది. జర్నీ చేస్తున్న టైమ్ లో ఆ కంపార్ట్‌మెంట్‌లో తను, తన స్నేహితులు తప్ప ఎవరూ లేరని, ఆ టైమ్ లో ఒకతను తమ కంపార్ట్‌మెంట్ లోకి వచ్చేందుకు ట్రై చేశాడని, అక్కడున్న గ్లాస్ డోర్ నుంచి తొంగిచూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని, అతని ప్రవర్తన తనను, తన ఫ్రెండ్స్ ను భయపడేలా చేసిందని, ఆ టైమ్ లో అసలేం చేయాలో అర్థం కాలేదని మాళవిక వెల్లడించింది. అలా భయపడుతూ ఉండగా ట్రైన్ మరో స్టేషన్ కు వచ్చిందని, అక్కడ తమ కంపార్ట్‌మెంట్ లోకి మరికొంత మంది వచ్చాక తమ భయం మొత్తం పోయిందని మాళవిక తెలిపింది. ఇక హీరోయిన్ లుక్స్ విషయంలో కూడా మాళవిక మాట్లాడింది. కొంచెం బరువు పెరిగి నార్త్ లో సినిమా చేయాలనుకుంటే అక్కడ ఛాన్సులు రావని, నార్త్ సినిమా కోసం కొంచెం సన్నబడి తిరిగి సౌత్ కు వస్తే ఇక్కడ బొద్దుగా ఉంటేనే బావుంటావంటారని మాళవిక తనకు ఎదురైన అనుభవాలను చెప్పుకొచ్చింది.

## ట్రెండీ లుక్‌తో అనసూయ అరాచకం

మొదట టెలివిజన్ రంగంలో గుర్తింపు అందుకుని ఆ తరువాత బిగ్ స్క్రీన్‌పై తనదైన ముద్ర వేసుకున్న నటి అనసూయ భరద్వాజ్. ఆమె టాలెంట్ అందం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. యాంకర్‌గా ఉన్నప్పుడు హ్యూమర్‌తో ఆకట్టుకుంది. తర్వాత 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప' లాంటి సినిమాలతో నటిగా ట్రాన్సిషన్ అద్భుతంగా చేసుకుంది. ముఖ్యంగా పుష్పలో 'దాక్షయణి' పాత్ర ఆమె కెరీర్‌లో టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది.

ఇక లేటెస్ట్ గా అనసూయ చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బ్లాక్ టాప్, స్కై బ్లూ స్కర్ట్‌లో ఓ మోడ్రన్ లుక్‌తో మెరిసిపోతున్న అనసూయ స్టైలిష్ గా దర్శనమిచ్చింది. జస్ట్ క్లాసిక్ లుక్ అని చెప్పుకోవచ్చు. మెటాలిక్ ఫాబ్రిక్ టచ్, జిప్ డిజైన్ విత్ స్లీవ్‌లెస్ స్టైల్‌తో ఈ డ్రెస్సింగ్ మోడర్న్ యూత్‌కు తెగ నచ్చేసినట్లు లైక్స్ చూస్తేనే అర్థమవుతుంది.

ఫోటోల్లో ఆమె ఎక్స్‌ప్రెషన్స్ మూడ్స్‌ను బాగా క్యాచ్ చేస్తూ కనిపించాయి. ఒక్కో పోజ్‌కి వేరే వేరే మూడ్‌ను చూపించగలిగిన అనసూయ ప్రొఫెషనల్ యాక్ట్రెస్‌గా ఎంత అభివృద్ధి చెందినదో స్పష్టంగా తెలుస్తోంది. ఆమె కళ్లలో కనిపిస్తున్న కాన్ఫిడెన్స్, కెమెరా ఫ్రెండ్లీ నేచర్ అన్నీ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేస్తున్నాయి. ఈ ఫోటోలకు భారీ లైక్స్ వస్తుండగా, అభిమానులు కామెంట్స్‌లో "కిల్లర్ లుక్", "ఎటిట్యూడ్ క్వీన్", "బోల్డ్ అండ్ బ్యూటిఫుల్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



## బీచ్ బికినీ క్వీన్ హొయలు చూసారా?

బికినీ బీచ్ సెలబ్రేషన్స్ తో నిరంతరం చిల్ చేస్తుంది నేహాశర్మ. ఈ బ్యూటీ సినిమాలతో కంటే, షికార్లతోనే ఎక్కువగా కాలక్షేపం చేస్తోంది. కెరీర్ పరంగా ఆశించిన పరిణతి లేకపోయినా కానీ, నిరంతరం సోషల్ మీడియాల్లో విజువల్ ట్రీట్ తో అలరిస్తోంది. నేహాశర్మ వరుస ఫోటోషూట్లు , వీడియో షూట్లు ఫ్యాన్స్ కి కావాల్సినంత వినోదం పంచుతున్నాయి. తాజాగా మరోసారి బికినీలో చెలరేగిపోయింది. ఈ ఆదివారం సూర్యుని ఎండలో ఇలా గడిపాను! అంటూ చాలా ఫోజులు కొట్టింది. ఒంటరి ద్వీపంలో శర్మా గాళ్ బికినీ ఫోజులు ప్రస్తుతం యూత్ లో వైరల్ గా మారాయి. నేహా శర్మ మాల్దీవుల నుండి తన అద్భుతమైన వెకేషన్ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయగా హీట్‌ను పెంచుతోంది. ఎంపిక చేసిన పాస్టెల్ బికినీపై లైమ్-గ్రీన్ కో-ఆర్డ్ సెట్ అద్భుతంగా కనిపిస్తోంది. అలా ఎండలో నడుస్తూ, తాటి చెట్టు కింద పోజులిచ్చినా .. బీచ్ ఇసుక లో చెప్పులు లేకుండా నడిచినా, బికినీలో గ్లామర్‌ను చిందించింది. ఎండలో ప్రశాంతమైన ఆదివారాన్ని నచ్చినట్టు ఆనందించడంలోనే కాదు... వీక్షకులను సంతుష్టులను చేయడంలోను ఎక్కడా తగ్గడం లేదు.



EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com